ఉష్ణోగ్రత (అంచనా) 15-5-2025

	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	38	26
తెనాలి	38	27
నరసరావుపేట	39	27
బాపట్ల	38	28
రెంటచింతల	39	28
చీరాల	38	28



● నిల్వ ఉంచిన పొగాకు బేళ్లు

బర్లీ మంటలు

- పొగాకు గిట్టుబాటు ధరపై ఆశలు ఆవిరి
- సమీక్షలకే పరిమితమవుతున్న పాలకులు
- పత్తాలేని కంపెనీలు.. ప్రభుత్వ ఆదేశాల బేఖాతరు

బర్లీ పొగాకు దిగుబడులు మొదలై రెండు నెలలు కావొస్తోంది. అప్పటి నుంచి పంట కు సరైన ధరలేక రైతులు తమ గోడు ప్రభుత్వానికి వెళ్లబోసుకుంటూనే ఉన్నారు. కనీస స్థాయిలో కూడా ధర పలకడం లేద ని వ్యాపారులు రకరకాల కొర్రీలతో మరీ తీసికట్టుగా అడుగుతున్నారని, ప్రభుత్వం తమ సమస్యపై దృష్టి పెట్టాలని పాలకులను అభ్యర్థిస్తూనే ఉన్నారు. రైతుల గోడును ఆలకించిన ప్రభుత్వం తాడేపల్లి వేదిక గా బర్లీ పొగాకు కొనుగోళ్లపై అటు అధికా రులతో ఇటు కంపెనీలతో సమీక్ష నిర్వ హించింది. కొనుగోళ్లను రోజు వారీ పర్యవేక్షించడానికి నలుగురు అధి కారులతో ఈ నెల 1 నుంచి గుంటూరు లోని పొగాకు బోర్డు కార్యాలయంలో కాల్ సెంటర్ సైతం ఏర్పాటు చేసింది. దీనికి కొనసాగింపుగా వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ కూడా క్షేత్ర స్థాయిలో పొగాకు రైతుల వెతల ను పరిశీలించడానికి పర్చూరు బాట పట్టారు. ఇదంతా కూడా పొగాకు రైతుల సమస్యల పరిష్కారం కోసం రెండు వారాల వ్యవధిలో ప్రభుత్వం వైపు నుంచి వచ్చిన కదలిక.

మూడు జిల్లాల పరిధిలో 96,000 వేల ఎకరాల వరకు..

గడచిన రెండేళ్ల బర్లీ పొగాకు సాగు రైతాంగానికి కొద్దిపాటి లాభాలను తెచ్చిపెట్టింది. దీంతో ఈ ఏడాది పెద్ద ఎత్తున రైతాంగం దాని వైపు మళ్లింది. సంప్రదాయ సాగు అయిన మిర్చి, పత్తిని కాదని కూడా రైతులు బర్లీ బాట పట్టారు. బర్లీసాగు బాపట్ల జిల్లాలో 70,000 ఎకరాలు ఉండగా ఇది రాష్ట్రంలోనే అత్యధికంగా నిలిచింది. సాగు మొత్తం పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలోనే ఉంది. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో మరో 26,000 ఎకరాల వరకు సాగైంది. దిగుబడులు మొదలై దాదాపు రెండు నెలలు కావొస్తోంది. ఇప్పటికీ దాదాపు 60,000 ఎకరాల్లో పంట రైతుల వద్దనే ఉంది. గతేడాది క్వింటా పొగాకు ధర గరిష్ఠంగా రూ.16,000 వరకు పలికింది. దిగుబడి ఎకరాకు 15 క్వింటాల వరకు రావడంతో రైతులు ఒడ్డున పడ్డారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. రెండు వా రాల క్రితం వరకు కనీసం 8 నుంచి రూ.9,000 వరకు కొనే వ్యాపారులైన గ్రామాల్లో కనబడేవారని ప్రస్తుతం ఆ ధరకు కూడా అడిగే నాధుడు కనబడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాపట్ల, మే 14, (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు కొనుగోళ్ళపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని రివ్యూ లు జరిపినా, పొగాకు కంపెనీలను కొనుగోళ్ల కోసం దాదాపుగా హెచ్చరించి నా రైతులకు దక్కిన ప్రయోజనం గుండుసున్నా. రెండు వారాల క్రితం వరకు ధర దిగదిడుపుగా అడిగే వ్యాపారులు అయినా వచ్చేవారని, ఇప్పుడు కనీసం పొగాకును అడిగే నాధుడే కరువయ్యారని రైతాంగం కన్నీరు మున్నీరవుతోంది. ప్రభుత్వం సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్న దశలోనే ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకుని తీవ్రతను తెలియజేశారు. ఈ ఘటన జరిగి వారం రోజులు గడవక ముందే ఇంకొల్లు మండలానికి చెందిన మరో రైతు బలవన్మరణానికి ప్రయత్నించగా సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇదే పరిస్థితి కొనసాగితే తమకు ఆత్మహత్యలు తప్ప మరో మార్గం కనబడడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధర విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తే తప్ప పొగాకు కంపెనీలు మొద్దు నిద్ర వీడవని రైతాంగం వాపోతోంది.

సమీక్షలకే పరిమితమైన ప్రభుత్వం..

సమస్య తీవ్రతను గుర్తించిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విషయాన్ని వ్యవసాయశాఖ దృష్టికి నెల రోజుల క్రితమే తీసుకెళ్లారు. అధికారులు, కంపెనీలు, రైతు సంఘాలనాయకులను ఒకే వేదికమీదకు తీసుకొచ్చి రైతులకు ఏ విధంగా చేస్తే మేలు జరుగుతుందనే అంశంపై కసరత్తు చేశారు. దీని ఫలితమే గుంటూరులో కాల్ సెంటర్ ఏర్పాటు చేయడం కానీ, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి క్షేత్రస్థాయి పర్యటనకు రావడం కానీ జరిగింది. కానీ ప్రభుత్వం వైపు నుంచి కంపెనీలకు కొనుగోళ్లపై ఆదేశాలు ఇవ్వడంతోనే సరిపెట్టారు తప్పితే వాటి అమలుపై పర్యవేక్షణే కరువయింది. గుంటూరులో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ అలంకార ప్రాయమే తప్ప దాని వల్ల రైతులకు జరిగిన లబ్ధి ఏంటంటే అధికారుల వద్దే సమాధానం లేకపోవడం గమనార్హం. బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల అందరి పరిస్థితి దాదాపుగా ఉరికొయ్యకు వేలాడుతున్నట్లే ఉంది. ప్రభుత్వమే స్వయంగా రంగంలోకి (మిగతా 8వ పేజీలో)

108కి.. సుస్తీ

- మార్గం మధ్యలోనే మొరాయిస్తున్న వాహనాలు
- అత్యవసర సేవలకు ఆటంకాలు
- ఎక్కడా ప్రాణాపాయం లేకున్నా... ఎప్పుడు... ఎక్కడ ఆగేనో! ఆ దేవుడికే ఎరుక
- గత ప్రభుత్వ పాలనలో నిర్వహణ లోపాలు
- కొత్త వాహనాలు మంజూరు చేయకుంటే ప్రాణాలకు నో గ్యారెంటీ



వేమూరు మార్కెట్ యార్డు దగ్గర టైర్ మార్చాల్సి రావటంతో మరో 108 వాహనం నుంచి టైర్ తీసి మార్చుకునే స్థితి

మనలో ఎవరైనా ప్రమాదానికి గురైతేనో!, లేక ఏదైనా అనారోగ్య సమస్య ఏర్పడితేనో వెంటనే గుర్తొచ్చేది 108 వాహనం. అయితే మన ప్రాణాలు అత్యవసర సమయాల్లో కాపాడే ఆ 108కే కష్టమొస్తే? ప్రతి క్షణం విరామం లేకుండా పరుగులు పెట్టాల్సిన వాహనం మధ్యలో సుస్తీ చేసి ఆగిపోతే? ఏ అర్ధరాత్రి సమయంలోనో మనలో ఎవరైనా అత్యవసర చికిత్స అవసరమై 108 వాహనంలో వెళుతున్నప్పుడు వ్యాన్ ముందుకు వెళ్ల కుండా మొరాయిస్తే? తలచుకుంటేనే వెన్నులో వణుకు పుడుతుంది కదూ!. ఒక్కసారిగా ప్రాణం పోయినంత భయం కలుగుతుంది కదూ!... అవును. ప్రస్తుతం అత్యసర సమయంలో సంజీవనిలా పరుగులుపెట్టే 108 వాహనాలకు నిర్వహణా లోపం సమస్యగా మారింది.

తెనాలి, మే 14, (ఆంధ్రజ్యోతి): చాలాచోట్ల 108 పాత వాహనాలకు గత ప్రభుత్వ కాలంలో పైపై మెరుగులుదిద్ది రోడ్డుమీదకు వదిలేయటంతో అవి ముందుకు వెళ్లనంటూ మొరాయిస్తున్నాయి. చిలకలూరిపేట హైవేపై గుంటూరు వెంగళాయపాలెం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి 1.40 గంటల సమయంలో ఒక 108 వాహనాన్ని మరో 108 వాహనం లాక్కెళుతూ కనిపించింది. ఒక రోగిని అత్యవసర వైద్యసేవ కోసం తీసుకెళుతున్న సమయంలో మొరాయించటంతో మరో వాహనం ఆగమేఘాలమీద వచ్చి దానిని లాక్కెళ్లిందనేది సమాచారం. అయితే రోగికి మాత్రం ప్రాణాపాయం ఏమీ జరగకపోవటం ఊపిరి పీల్చుకునే విషయం. మంగళవారం సాయంత్రం వేమూరు మార్కెట్ యార్డ్ 108 వాహనం టైర్లు దెబ్బతింటే మరో వాహనం వచ్చి, దాని టైర్‌ను తీసి ఆగిన వాహనానికి అమర్చి ముందుకు కదిలించారు. ఇలా అనేక ఉదాహరణలు ఈ మధ్య కాలంలో కనిపిస్తూనే ఉన్నాయి. దీనంతటికీ కారణం... వాహనాల నిర్వహణ సరిగా లేకపోవటం, గత ప్రభుత్వ కాలంలో వీటిని సరిగా పట్టించుకోకపోగా, విజయవాడ, తాడేపల్లి మెకానిక్ షెడ్‌లలో పైపై మెరుగులద్ది యథావిధిగా వెనక్కు పంపేయటంతో కష్టాలు తప్పటంలేదు. పాతవాటి నిర్వహణ తీరు ఇట్లాఉంటే... ఎప్పుడో రోడ్డెక్కిన పాత వాహనాల స్థానంలో కొత్తవి మంజూరు చేయకపోవటం, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ఒకే వాహనం అందుబాటులో ఉంచటంతో అవి విరామం లేకుండా తిరగాల్సి రావటం అవి మొరాయించటానికి కారణమవుతోంది.



నిర్వహణ సరిగాలేక మధ్యలోనే ఆగిపోయిన 108 వాహనం

కూత కూయలేక.. ముందుకు కదల లేక..

108 వాహనం అంటే పైన వెలిగే లైట్లు, కుయ్... కుయ్ మంటూ కూత వేసుకుంటూ అత్యవసర సేవలను గుర్తుచేస్తూ పరుగులుపెట్టే వాహనాలే గుర్తొస్తాయి. అయితే ఇప్పుడు చాలా వాహనాలు కూత (మిగతా 8వ పేజీలో)

నీరు రాని కుళాయిలెందుకు?

జల్‌జీవన్ మిషన్ తీరుపై అసహనం ● ఉపాధి పనులపై విచారణకు ఆదేశాలు ● 20 సూత్రాల పథకం ఛైర్మన్ లంకా దినకర్

నరసరావుపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): 'జల్ జీవన్ మిషన్‌లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. వాటిలో నీరు రావడంలేదు. ఇక కుళాయిలను ఏర్పాటు చేసి ఉపయోగం ఏమిటి..' అంటూ 20 సూత్రాల పథకం ఛైర్మన్ లంకా దినకర్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో లంకా దినకర్ ప్రసంగించారు. కేవలం లక్ష్యాలు పూర్తి చేయాలనే ఆలోచనతో నీటి వనరులను అనుసంధానం చేయకుండానే కుళాయిలు ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించి డ్రెయిన్లు విస్మరించడంపై అధికారులను నిలదీశారు. పేదలకు మంజూరు చేసిన గృహాలలో తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నారన్నారు. పనుల్లో పురోగతి సాధించలేని గుత్తేదారులను తొలగించి కొత్తవారికి కేటాయించాలన్నారు. జిల్లాలో గతేడాది 85 లక్షల పనిదినాలతో రూ.70 కోట్లు వినియోగించాలని లక్ష్యం కాగా, రూ.109 కోట్లు ఖర్చు చేయడంపై ఆరా తీశారు. మరోవైపు మెటీరియల్ కాంపోనెంట్ పనులలో లక్ష్యాలను చేరుకోలేకపోవడంతో జిల్లాకు రావాల్సిన నిధులు కోల్పోయామన్నారు. గత ఐదేళ్లలో మెటీరియల్ కాంపోనెంట్ వ్యయం ద్వారా కల్పించిన ఉపాధి పనుల్లో ఆస్తుల నాణ్యత, నిబంధనలకు విరుద్ధంగా చేసిన వ్యయంపై విచారణ జరిపించాలని కలెక్టర్‌కు సూచించారు. టెంపుల్ టూరిజం, నాగార్జున సాగర్, కొండవీడుకోట వంటి ఆహ్లాదకర, వినోదాత్మక పర్యాటక అవకాశాలతో అభివృద్ధిపై అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, స్వర్ణాంధ్ర సాధన దిశగా సీఎం చంద్రబాబు ఆలోచనలకు తగ్గట్లుగా అధికారులంతా కలిసి పని చేస్తేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి 28 కేసులు నమోదయ్యాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్

ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం పెరగాలి

జిల్లాలో ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయ విధానంలో 50 వేల ఎకరాలు సాగవుతుండగా దానిని 1.25 లక్షల ఎకరాలకు పెంచాలని ఆదేశించారు. రసాయనాల అవసరం లేని ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణ సమతుల్యత, భూసారం కాపాడొచ్చన్నారు. పీఎం ఫసల్ బీమాపై అవగాహన లేక రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రీమియం సొమ్ము సకాలంలో చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి కల్పన, పశువులకు నీటి తొట్ల ఏర్పాటు, ఫారం పాండ్ల నిర్మాణం, కాల్వల మరమ్మతులు, అమృత్ సరోవర్ పనుల్లో లక్ష్యాలు చేరుకోవాలన్నారు. పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ, బీసీలకు రూ.98 వేల వరకు, ఇతరులకు రూ.78 వేల వరకు సబ్సిడీతో ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ అందించే అవకాశం ఉందన్నారు. ప్రతీ పథకానికి ప్రచారం కల్పించి, వీలైనంత ఎక్కువమందికి లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, యువతకు ఉపాధి కల్పన, తాగు నీరు అందించడమే లక్ష్యంతో అధికారులు పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు చదలవాడ అరవింద బాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ కోటేశ్వరరావు, శిల్పారామం సొసైటీ ఛైర్‌పర్సన్ మంజులారెడ్డి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంగారావు, డీఆర్వో మురళి పాల్గొన్నారు.

ముందుగానే వచ్చేశాయి..



పాఠశాలలకు చేరిన పుస్తకాలు

రెంటచింతల, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభానికి ఇంకా నెల గడువు ఉంది. అయినా నెల ముందుగానే వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలు పాఠశాలలకు చేరాయి. ముందుగానే పుస్తకాలు రావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిధిలోని పాఠశాలలకు ప్రభుత్వం అందచేసే వివిధ తరగతుల పాఠ్యపుస్తకాలు బుధవారమే చేరాయి. గతంలో పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బూట్లు, బెల్టులు తదితరాలు విద్యార్థులకు సకాలంలో అందేవి కావు. దీంతో విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అయితే ఈ ఏడాది 1 నుంచి 10వ తరగతికి సంబంధించి 12600 పాఠ్య పుస్తకాలు వచ్చాయి. ఇంకా 4 వేల పుస్తకాలు రానున్నట్లు సమాచారం. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు వాటిని అందచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



నరసరావుపేటలో సింగిల్ సందడి

8

సర్వర్.. సంకటం!

- మొరాయిస్తున్న రైస్ కార్డు సర్వర్
- మూడు రోజులుగా అదే పరిస్థితి
- వందల్లో వస్తున్న దరఖాస్తులు..
- రోజుకు ఒకటి రెండు దరఖాస్తులతో సరి
- తలలు పట్టుకుంటున్న సచివాలయ సిబ్బంది

8

షానూన్‌కు అంతర్జాతీయ పతకం తెనాలికే గర్వకారణం


పవర్ లిఫ్టర్ షానూన్‌ను సత్కరిస్తున్న డబుల్ హార్స్ ఎండీ శ్యాంమోహన్‌ప్రసాద్

తెనాలి అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : పవర్ లిఫ్టింగ్ పోటీలలో తొలి అంతర్జాతీయ పతకం రావడం తెనాలికి గర్వకారణమని డబుల్ హార్స్ సంస్థ ఎండీ మునగాల శ్యాంమోహన్ ప్రసాద్ చెప్పారు. స్థానిక క్విక్ జిమ్‌లో శిక్షణ పొంది పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్ మదిర షానూన్‌ను బుధవారం జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఆసియా సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణి నాలుగు గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంచ్ పతకాలు సాధించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా రంగంలో భారతదేశ ప్రతిష్ఠ ఇనుమడింపజేసే విధంగా శిక్షణ పొందాలని చెప్పారు. పతకాలు సాధించేందుకు కృషి చేసిన కోచ్‌లు ఘట్టమనేని సాయిరేవతి, పూసపాటి శివరామకిరణ్‌రాజులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో ఏఐ ఆధారిత గుండె వైద్యచికిత్సలు


ఏఐ బేస్ట్ టెక్నాలజీతో డాక్టర్లు నాగార్జున, హేమసుందర్

గుంటూరు మెడికల్, మే 14 (ఆంధ్రజ్యోతి): కోస్తా ఆంధ్రాలో మొట్టమొదటి సారిగా ఏవీవీఐజీవో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంట్రావ్యాస్క్యులర్ అల్ట్రా సౌండ్ (ఐవీఎస్‌యూ) గైడెడ్ పర్క్యుటేనియస్ కరోనరీ ఇంటర్వెన్షన్ (పీసీఐ)ను శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో విజయవంతంగా నిర్వహించారు. ఈ అధునాతన ప్రక్రియ కృత్రి మ మేధ ఆధారిత ఇమేజింగ్‌ను రియల్ టైమ్ ఇంట్రావ్యాస్క్యులర్ విజువలైజేషన్‌తో అనుసంధానం చేస్తుంది. దీనివల్ల శస్త్రచికిత్స సమయంలో రోగుల రక్తనాళాల కొలతలు, నాళాల్లో పేరుకుపోయిన కొవ్వు పరిమాణం, స్టెంట్ పొజిషన్‌ను ఖచ్చితంగా అంచనా వేసేందుకు వీలు కలుగుతుంది. శస్త్రచికిత్స సమయాన్ని తగ్గించడంతో పాటు సురక్షితమైన ఫలితాలను అందిస్తుంది. ఈ సందర్భంగా గుజ్జనగుళ్ల సెంటర్‌లోని శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ ఇంటెర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగార్జున గొట్టిపాటి, క్యాథ్ ల్యాబ్ డైరెక్టర్ డాక్టర్ హేమసుందర్ కొర్రపాటి మాట్లాడుతూ ఈ అధునాతన వ్యవస్థ సంక్లిష్టమైన కరోనరీ రక్తనాళ గాయాలకు చికి త్స చేయడంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. క్లిష్టమైన రక్తనాళాల సమస్యలతో బాధపడుతున్న రోగికి శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో ఏవీవీఐజీవో టెక్నాలజీని ఉప యోగించి చికిత్స చేసినట్లు వారు వెల్లడించారు. హైడెఫినిషన్ ఏఐ బేస్డ్ పవర్డ్ ఇమేజింగ్ పరిజ్ఞానంతో రేడియేషన్ తగ్గించే సరైన స్టెంట్ ప్లేస్‌మెంట్‌ను చేసినట్లు తెలిపారు. రోగి పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి చేసినట్లు వెల్లడించారు.

విస్తృతమైన పరిశోధనలతో రైతులకు మేలు

● డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఢిల్లీరావు



టెక్నాలజీ ఇన్వెంటరీ సీడీని ఆవిష్కరిస్తున్న ఢిల్లీరావు, శారద జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ)మే 14(ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తల విస్తృతమైన పరిశోధనలు చేయటం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎస్ ఢిల్లీరావు పేర్కొన్నారు. బుధవారం లాంఫాంలోని అచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో యా న్యువల్ రివ్యూ, యాక్షన్ ప్లాన్ మీటింగ్ ఆఫ్ కేవీకే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని 23 కృషి విజ్ఞాన కేంద్రాలకు సంబంధించిన 2025-26 సంవత్సరంలో చేపట్టవలసిన ప్రణాళికలపై వ్యవసాయ విశ్వవిద్యాలయం, అటారి జోన్-ఎక్స్ సంయుక్తంగా మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాల్లో విస్తరణ శాస్త్రవేత్తలు రైతుస్థాయిలో చర్చలు జరపాలన్నారు. రైతుల సమస్యలు గుర్తించి పరిష్కారాలు చూపాలన్నారు. పరిశోధనా శాస్త్రవేత్తలు ఎక్కువగా రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా పరిశోధనలు జరిపి వారు ఆర్థికంగా స్థిరపడేలా చూడాలన్నారు. విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రా లు రైతుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే విధంగా పరిశోధన శాస్త్రవేత్తలు ముందుకు వెళ్లాలన్నారు. పరిశోధన సత్ఫలితాల డాక్యుమెంటేషన్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అటారి జోన్ ఎక్స్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు, విస్తరణ కేంద్రాలు మాత్రమే కాదని, పరిశోధనా సంస్థలుగా కూడా జిల్లా స్థాయిలో వ్యవహరించాలన్నారు. విశ్వవిద్యాలయం సహకారంతో జిల్లా స్థాయిలో డ్రోన్ పైలెట్ శిక్షణ సంస్థలుగా వ్యవహరించాలని కోరారు. అనంతరం టెక్నాలజీ ఇన్వెంటరీ సీడీని, కేవీకే ఘంటలసాల, కలికిరి, గుంటూరు వారు తయారు చేసిన ప్రచురణలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ శివనారాయణ, వైఎ స్సాఆర్ హార్టికల్చర్, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విస్తరణ సంచా లకులు, కేవీకేల శాస్త్రవేత్తలు, పరిశోధన సంచాలకులు పాల్గొన్నారు.

కొండవీడుకోటను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దండి

కేంద్రమంత్రిని కోరిన ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి


కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక కొండవీడుకోటను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కేంద్ర పర్యాటక శాఖామంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి కేంద్ర మంత్రిని కలసిన ప్రత్తిపాటి ఈ మేరకు విజ్ఞప్తి చేస్తూ కొండవీడుకోట సమగ్రాభివృద్ధిపై చర్చించారు. గొప్ప సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతం కొండవీడుకోట ఏపీ రాజధాని అమరావతికి అతి సమీపంలో ఉన్నదని, సహజసిద్ధమైన సరస్సులతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యకలాపాలకు అనువైన ప్రదేశమని, అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాంత అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా కొండవీడు ప్రాంతాన్ని ఇన్ క్రెడిబుల్ ఇండియా, దేఖో అప్నా దేశ్ విభాగాల క్రింద విస్తృత ప్రాచుర్యం కల్పించాలని కోరారు.

జాతీయ సర్క్యూట్‌లో చేర్చండి

కొండవీడుకోటను జాతీయ వారసత్వ సర్క్యూట్‌లో చేర్చాలని, తద్వారా అంతర్జాతీయ స్థాయిలో కొండవీడుకోటకు ఖ్యాతి ఇనుమడిస్తుందన్నారు. కోటను సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకోసం ఫుడ్ కోర్టులు, రోప్‌వే మార్గం, మౌళిక వసతుల కల్పనకు కేంద్రం నుంచి నిధులు వచ్చేలా చూడాలని అభ్యర్థించారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించిన కెన్యా బృందం


కెన్యా ప్రతినిధులతో విజ్ఞాన్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు (విద్య) మే 14 (ఆంధ్రజ్యోతి):భారత్, కెన్యా దేశాల మధ్య అకడమిక్, పరిశోధనలు, అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మసీ, బయో మెడికల్, స్కిల్ డెవలప్‌మెంట్, డ్రోన్ టెక్నాలజీతోపాటు పరస్పర అవగాహన, దౌత్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని కెన్యాలోని విహిగ కౌంటీ గవర్నర్ హెచ్‌ఈ డాక్టర్ విల్బర్ కే ఒట్టిచిలో అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీని కెన్యా దేశానికి చెందిన ప్రతినిధులు సందర్శించారు. దౌత్య సంబం ధాలపై ప్రతినిధులు మాట్లాడారు. ఫుడ్, టెక్నాలజీ, విద్యా ఉద్యోగ అవకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో కెన్యా దేశానికి చెందిన 8 మంది ప్రతినిధులు, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగం డెయిరీని ఆదర్శంగా తీసుకుంటాం : కెన్యా ప్రతినిధులు


సంగం డెయిరీ ఉత్పత్తులను పరిశీలిస్తున్న విహిగ కౌంటీ గవర్నర్ విల్బర్ బృందం

పొన్నూరుటౌన్, మే 14: సంగం డెయిరీని కెన్యా దేశంలోని విహిగ కౌంటీ రాష్ట్ర గవర్నర్, కెన్యా హెల్త్ కమిటీ చైర్మన్ హెచ్‌ఈ డాక్టర్ విల్బర్ కే ఒట్టిచిలో బృందం బుధవారం సందర్శించింది. సంగం డెయిరీ నిర్వహణ, తయారు చేస్తున్న ఉత్పత్తులు, రైతు సమాఖ్యల గురించి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విల్బర్ బృందానికి వివరించారు. సంగం డెయిరీలోని వివిధ విభాగాలను కెన్యా బృందం సందర్శించి అధునాతన ప్లాంట్‌లను పాలు ప్రాసెసింగ్ చేసే విధానాలు, పాల నుంచి ఉప ఉత్పత్తుల తయారీ వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్, డాక్టర్ విల్బర్ మాట్లాడుతూ డెయిరీ రంగం ద్వారా రైతుల ఆదాయం పెంచేందుకు రైతాంగాన్ని వృద్ధి పథంలో నడిపేందుకు సంగం డెయిరీని సందర్శించినట్లు చెప్పారు. సహకార వ్యవస్థ ద్వారా రైతుల భాగస్వామ్యంతో అభివృద్ధి చెందుతున్న సంగం డెయిరీని ఆదర్శంగా తీసుకుని కెన్యా దేశంలో కూడా డెయిరీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. డెయిరీని సందర్శించిన వారిలో కెన్యా బృంద సభ్యులు డాక్టర్ ఫెడ్రిక్, కౌంటీ అసెంబ్లీ ఎంసీఏ టౌన్ టిర్రా, హెల్త్ సర్వీసెస్ ముఖ్య అధికారిణి డాక్టర్ మేరీ సుసాన్, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ క్రిస్టోఫర్, మెడికల్ ఆఫీసర్ ఎలిజెబెత్, వెలాసిటీ ప్రాజెక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ హరిమూర్తి, ప్రెస్ యూనిట్ డైరెక్టర్ ట్రాన్సిస్టో తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ ఎండీ గోపాలకృష్ణన్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం : సామినేని


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), మే 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని కమ్మ బాలికల వసతి గృహంలో ప్రవేశాల కోసం 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు తెలిపారు. వసతి గృహ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి, ఆపై చదువుతున్న పేద, ప్రతిభ కల్గిన విద్యార్థినులు ఈ ప్రవేశాలకు అర్హులన్నారు. దేశంలో ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. దరఖాస్తులను వసతి గృహంలో గాని "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. కమ్మజనసేవా సమితి. కామ్"అనే వెబ్‌సైట్‌లో నేటి నుంచి అందుబాటులో ఉంచామని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను, ఇతర సర్టిఫికెట్స్ జతపరిచి ఈనెల 29వ తేదీ లోపు వసతి గృహంలో నేరుగా అందజేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను కార్యాలయంలోని నోటీసు బోర్డుపై, వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు. 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాల చదివి ప్రతిభ చూపిన విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ 7వేలు చొప్పున కుల, మతాలకు అతీతంగా ఉపకారవేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 0863- 2355471, 2260666 అనే నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ దాతల సహకారంతో నూతన భవన నిర్మాణం మొదలైందన్నారు. నిర్మాణాన్ని పూర్తిచేసి 2027-28 విద్యా సంవత్సరానికి నూతన భవనంలో ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు ఘంటా పున్నారావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, వడ్లమూడి నాగేంద్ర. గుంటుపల్లి కోటేశ్వర రావు, వడ్లమూడి శివరామకృష్ణయ్య, పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

● వారం రోజులుగా గుర్తించని స్థానికులు ● దుర్వాసన కారణంగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చిన ఘటన

వినుకొండటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని రెడ్డినగర్ 2వ లైన్‌లో ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పాతకోట రామకృష్ణారెడ్డికి చెందిన ఇంట్లో వారు అద్దెకు ఉంటున్నారు. గత వారం రోజుల క్రితం ప్రియుడితో ఘర్షణ పడిన ఆ యువతి 3వ ఫ్లోర్‌లో ఉరివేసుకుని మృతిచెందింది. గత వారం రోజులుగా ఆమె కనిపించకపోవడం, బుధవారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న సీఐ శోభన్‌బాబు సంఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు బొల్లాపల్లి మండలం సోలాయపాలెం గ్రామానికి చెందిన సుభాషిణి (25)గా గుర్తించారు. ఇటీవల రెడ్డినగర్‌లోని మరొక ప్రాంతం నుంచి 2వ లైన్‌కు మూడు నెలల క్రితం యువకుడితో కలిసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో ఇల్లు అద్దెకు తీసుకున్నారని, వారం రోజులుగా జరిగిన ఘర్షణలో ఇద్దరు కనిపించకపోవడంతో పాటు దుర్వాసన రావడంతో ఆ ప్రాంతంలో కలకలం రేపింది. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నట్లు సీఐ శోభన్‌బాబు తెలిపారు.

వైసీపీ నేత బూడిద శ్రీనుపై కేసు నమోదు

మాచర్ల రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులవరం పంచాయతీ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటం ధ్వంసానికి పాల్పడడంతోపాటు.. పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటూ హల్‌చల్ చేసి ఎయిర్‌స్ట్రిప్ ఉద్యోగి విధులు ముగించుకొని గృహానికి వెళ్తుండగా అతనిపై దాడికి పాల్పడిన కేసులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడు మాచర్ల మండల ఎంపీపీ బూడిద మంగమ్మ తనయుడు, వైసీపీ నేత బూడిద శ్రీనుపై విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎయిర్‌స్ట్రిప్ ఉద్యోగి దత్త శివనాగేంద్రబాబు ఫిర్యాదు చేయడంతో విజయపురిసౌత్ ఎస్‌ఐ షఫి 115 (2), 126 (2), 3 (5), 351 (2) బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

రైతులకు ఉచితంగా 4.5 లక్షల మొక్కల పంపిణీ


అవగాహనా ఒప్పందాన్ని మార్చుకుంటున్న అసిస్ట్, వరహా సంస్థల నిర్వాహకులు

చిలకలూరిపేట, మే14 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థిక అభివృద్ధి, ఉద్యానవన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకొని స్థానిక అసిస్ట్ సేవా సంస్థ, వ్యవసాయ ఆధారిత టెక్నాలజీ సంస్థ వరాహ మధ్య బుధవారం అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందాన్ని అసిస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ జాస్తి రంగారావు, వరాహ భాగస్వామ్యాల మేనేజరు ఎంఎస్ఎన్ మూర్తి పరస్పరం మార్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం వచ్చే సీజన్‌లో రూ. 5.24 కోట్ల విలువ కలిగిన నాలుగున్నర లక్షల మామిడి, జీడి, కొబ్బరి, నిమ్మ, ఎర్రచందనం, టేకు మొక్కలను ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సుమారు పది జిల్లాల్లోని రైతులకు ఉచితంగా పంచనున్నారు. ఈ మొక్కలను అసిస్ట్ సంస్థ సిద్ధ చేస్తుంది. దీంతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయ వనరులు అందుబాటులోకి రావడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు వీలవుతుంది. ఈ సందర్భంగా జాస్తి రంగారావు మాట్లాడుతూ అసిస్ట్ స్థాపన నుంచే గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోంది. వరాహ సంస్థ మేనేజరు ఎంఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ పంటల శాస్త్రీయ విశ్లేషణ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ

గుంటూరు (విద్య) మే 14 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (కొత్తపేట) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బ్యూటీషియన్, రిఫ్రిజిరేషన్ ఏసీ సర్వీసింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ డీ సందీప్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్ కోర్సుకు 19 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మహిళలు అర్హులని, 30 రోజులపాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కోర్సు జూన్ 12వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు వివరించారు. అదేవిధంగా ఏసీ రిఫ్రిజిరేషన్ ఏసీ సర్వీసింగ్ 19 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు ఉన్న యువకులు అరు లని, శిక్షణ 30 రోజులు ఉంటుందని తెలిపారు. ఈ కోర్సు జూన్ 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాల కోసం కొత్తపేట, యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంకు రోడ్, (0863-2336912,9700687696) లో సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్య శాఖ మెరిట్ జాబితా విడుదల

● అభ్యంతరాలకు 20 వరకు గడువు

గుంటూరు మెడికల్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ కోసం ఎంపిక చేసిన అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రొవిజనల్ మెరిట్ జాబితాపై అభ్యంతరాలు ఉన్న వారు మే 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు లిఖితపూర్వకంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు. ఆ తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోమని ఆమె స్పష్టం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 512.80 అడుగులు ఉంది. ఇది 136.47 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 450, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 450 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

పిడుగుపాటుకు మహిళ మృతి


షేక్ పర్వీన్ (ఫైల్)

యడ్లపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు మహిళ మృతిచెందిన సంఘటన యడ్లపాడు మండలం కారుచోల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ పర్వీన్(34) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రోజులాగే బుధవారం మరో ఆరుగురితో కలసి మిరప కాయలు కోసేందుకు పొలానికి వెళ్ళింది. సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గట్టువైపు పరుగులు పెట్టారు. ఆ సమయంలో అందరికన్నా వెనుకగా పొలంలో ఉన్న పర్వీన్ సమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పిడుగు పాటుకు రెండు చెవుల నుంచి రక్తం రావడంతోపాటు శరీర భాగాలపై పలు చోట్ల చర్మం కాలిపోయి గాయాలయ్యాయి. పిడుగు పడిన ప్రాంతంలో మిరప చెట్లు వేర్లతో పైకి లేచిపడడంతోపాటు నాలుగు మీటర్ల పరిధిలో చెట్లు వడలి పోయాయి. సహచర కూలీల సహాయంతో మృతురాలి భౌతికకాయాన్ని గ్రామంలోని నివాసానికి చేర్చారు. పర్వీన్‌కు భర్త సైదా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పిడుగు పడిన ప్రాంతాన్ని పరిశీలించడంతోపాటు ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.

టూరిస్ట్‌లకు రక్షణ కల్పించలేకపోయారు

కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

బాపట్ల, మే 14 (ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో టూరిస్ట్‌లకు రక్షణ కల్పించలేకపోయారని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం విమర్శించారు. జిల్లా కేంద్రమైన బాపట్లలోని పటేల్‌నగర్‌లో బుధవారం పార్టీశ్రేణులు ఏర్పాటు చేసిన సమావేశంలో జేడీ శీలం మాట్లాడుతూ ఉగ్రవాదులు ఉన్నారన్న సంకేతాలు ఉన్నప్పటికి రక్షణ కల్పించకపోవటం దారుణమన్నారు. రక్షణ ఉందని పాలకులు చెప్పటం వల్లే విహారయాత్రకు వెళ్ళి టూరిస్ట్‌లు ప్రాణాలు కోల్పోయారన్నారు. వారికి రక్షణ కల్పించటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అమెరికా అధినేత ట్రంప్ దగ్గర ఎందుకు సాగిలపడ్డారో చెప్పాలన్నారు. యుద్ధం ఆపే విషయంలో అంతా తానే చేశానని ట్రంప్ ఎందుకు చెబుతున్నాడన్నారు. దీనిపై ఆల్ పార్టీల మీటింగ్ పెట్టి చర్చించాలన్నారు. ప్రజాస్వామ్యం అంటే బీజేపీ ఒక్కటే కాదని, అన్ని పార్టీలతో పార్లమెంట్‌లో చర్చించాలన్నారు.

గుంటూరు వేదికగా.. సర్వేపై వర్క్‌షాప్

నేడు, రేపు నిర్వహణ.. వివిధ రాష్ట్రాల అధికారుల రాక

గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడర్‌నైజేషన్ ప్రోగ్రాం (డీఐఎల్ఆర్ఎంపీ) కింద సర్వే/రీసర్వేపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ గురువారం నుంచి రెండు రోజుల పాటు గుంటూరులో జరగనుంది. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ వర్క్‌షాప్ నిర్వహణకు ఒప్పించారు. గుంటూరులోని ఐటీసీ హోటల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు అస్సాం, కర్ణాటక, రాజస్థాన్, కేరళ, బీహార్, హరియాణ రాష్ట్రాల నుంచి సర్వే అధికారులు హాజరుకానున్నారు. గతంలో నేషనల్ ల్యాండ్ రికార్డ్ మోడర్‌నైజేషన్ ప్రోగ్రాం(ఎ న్ఎల్ఆర్ ఎంపీ)గా ఉన్న దీనిని కేంద్ర ప్రభుత్వం డీఐఎల్ఆర్ ఎంపీగా మార్పు చేసింది. డీఐఎల్ఆర్ఎంపీ ద్వారా ఆధునిక, సమగ్ర, పారదర్శకతతో కూడిన ల్యాండ్ రికార్డు మేనేజ్‌మెంట్ సిస్టమ్ అభివృద్ధి చేస్తారు. గురువారం వర్క్‌షాప్‌ని కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభిస్తారు. డీవోఎల్ఆర్ జాయింట్ సెక్రటరి కునాల్ సత్యార్థి ప్రారంభోపన్యాసం చేస్తారు. శుక్రవారం వర్క్‌షాపులో ఉదయం కేరళ, బీహార్, లద్దాక్, హరియాణల నుంచి వచ్చిన అధికారులు ప్రజంటేషన్ ఇస్తారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి హుండీ ఆదాయం రూ.33వేలు

నకరికల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): నకరికల్లులో కొండపై కొలువై ఉన్న శ్రీలక్ష్మీనర సింహస్వామి దేవాలయంలో ఈనెల 12వ తేదీ తిరునాళ్ళ నిర్వహించారు. హుండీ ఆదాయాన్ని 14వ తేదీ బుధవారం లెక్కించగా రూ.33,693 వచ్చినట్టు ఈవో వై వెంకయ్య తెలిపారు. పర్యవేక్షణ అధికారి ఆర్ వెంకటేశ్వరరావు సమక్షంలో హుండీని లెక్కించినట్టు తెలిపారు.

బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సులో ఉచిత శిక్షణ

నకరికల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితో ఆర్థి కంగా ఎదగాలనుకొనే గ్రామీణ మహిళలకు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ జీబీ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19నుంచి 45 సంవత్సరాల వయస్సుగల మహిళలకు 30రోజులపాటు శిక్ష ణ ఉంటుందన్నారు. ఉచిత హాస్టల్, భోజన సదుపాయం ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 9700687696, 9949930155 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.


మాక్‌డ్రిల్‌లో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

విజయపురిసౌత్‌లో ఎస్‌డీఆర్‌ఎఫ్ మాక్‌డ్రిల్

మాచర్ల రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గల ఏపీఆర్‌డీసీ కళాశాలలో బుధవారం మంగళగిరికి చెందిన ఎస్‌డీఆర్‌ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందం మాక్‌డ్రిల్ నిర్వహించింది. తీవ్రవాదుల చర్య లకు ప్రతిచర్యగా ప్రజలు ఎలా స్పందించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ గాంధీ, తహసీ ల్దార్ బండెల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి పేర్లు నమోదు చేసుకోవాలి

నకరికల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): రైతులంతా రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏవో కే దేవదాసు కోరారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాభూమి కలిగి ఉన్న రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులని ఏవో తెలిపారు.

● రెంటచింతల, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతు లకు అన్నదాత సుఖీభవ పథకం రిజిస్ట్రేషన్ ప్రారంభించి నట్లు మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి చె ప్పారు. ఈనెల 20 లోగా రైతు సేవా కేంద్రాలకు ఆధార్‌కార్డ్, వన్ బి, రేషన్‌కార్డు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

సైకిల్‌పై మహానాడు యాత్రకు బాజీ

పిడుగురాళ్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో జరిగే మహానాడుకు సైకిల్‌పై బయలుదేరిన గుత్తికొండ గ్రామానికి చెందిన షేక్ బాజీని బుధవారం గురజాల ఎమ్మెల్యే యరప తినేని శ్రీనివాసరావు అభినందించారు. సైకిల్‌పై మహానా డుకు వెళ్లిరావడం పార్టీ కార్యకర్తగా బాజీకే సాధ్యమన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

● తొమ్మిది మందిపై కేసు నమోదు

మాచవరం, మే 14(ఆంధ్రజ్యోతి): మాచవరంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడగా తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ శేఖర్ బుధవారం తెలిపారు. దేవాలయ నిర్వహణ విషయంలో సొంత అన్నదమ్ములు ఘర్షణ పడి గొడ్డళ్ళతో, రాడ్లతో కొట్టుకున్నారు. ఈ సంఘటనలో మొక్కపాటి శ్రీనివా సరావు, మొక్కపాటి శేషగిరిరావు, మరి కొంతమందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరందరూ పిడుగురాళ్ళ, గుంటూరు ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. కందుల రామాంజనేయులు, మొక్కపాటి శేషగిరిరావు ఇరువురి ఫిర్యా దుల మేరకు తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

జాబ్ మేళా

సత్తెనపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో బుధవారం హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా నిర్వహించారు. 180మంది యువతీ యువకులు జాబ్‌మేళా కు హాజరుకాగా 17 కంపెనీలకు పలువురు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సీవీపీ అంజనాకుమారి, హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్ కో-ఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి, వెంకటేష్, ఏసయ్య, సునీత, మస్తాన్, రమేష్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

సత్తెనపల్లి రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు జమండ్లమూడి లింగారావు జ్ఞాపకార్థం మండ లంలోని రెంటపాళ్ళలో గ్రామ డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ కమిటీల ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా జరుగుతున్న మండల స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో శ్రీఆంజ నేయ జట్టు మొదటి, సమ్మర్ స్టార్ జట్టు రెండు, జేఎల్‌ఆర్ యూత్ జట్టు మూడో స్థానంలో నిలిచినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ జట్లకు నగదు ప్రోత్సాహంతో పాటు కప్, షీల్డ్ లను అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెండాల మహేష్, జడ రాజ్‌కుమార్, హరి పోతురాజు, అమూల్య, భగత్, పెద్ద తాతారావు, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 14(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టు లో బుధవారం 22.64 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచిం తల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూ సెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

పిడుగురాళ్లను నెం.1 సిటీగా తీర్చిదిద్దుతా

● చిల్డ్రన్స్ పార్కు, సోలార్ లైటింగ్ ప్రారంభోత్సవంలో యరపతినేని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే 14(ఆంధ్రజ్యోతి): నెం.1 సిటీగా పిడుగురాళ్లను తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రాత్రి పిడు గురాళ్ల పంపుహౌస్ వద్ద వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కు, సోలార్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని ఆయన అన్నారు. చెరువులో పూడిక తీసి మధ్యలో మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టీ రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ఆయన తెలిపారు. పిడుగురాళ్ల పట్టణాన్ని ఏవిధంగా అభి వృద్ధి చేస్తున్నామో.. ఇంకా ఏమి చెయ్యాలో ప్రజల నుండే సూచనలు, సలహాలు తీసుకునేందుకు మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేశామ న్నారు. ప్రతి మనిషి ఆరోగ్యంగా వుంటేనే ఏదైనా సాధించగలమనే భరోసా కలుగుతుందని, ఆరో గ్యాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరికి వాకింగ్, రన్నింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రూ.300కోట్లతో పిడుగురాళ్ల పట్టణాన్ని అభివృద్ధి చేసే దిశగా చూస్తున్నానని, మున్సిపల్ భవనం, తాగునీటి సౌకర్యం, సెంట్రల్ లైటింగ్‌తో పాటు మరికొన్ని పనులు పూర్తి చేస్తానన్నారు. రోజురో జుకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని రాబోయే 25 ఏళ్లలో పెరిగే జనాభాకు సరిపో యేలా మౌలిక వసతులు, అభివృద్ధి పైనే దృష్టి సారిస్తున్నానన్నారు. గుర జాల నుండి ఏడుసార్లు పోటీచేసే అవకాశం కలి గిందని, గెలిచినా.. ఓడినా ప్రజల మధ్యే ధైర్యంగా తిరిగానని, ఏనాడు కుంగుబాటుకు, ఒత్తిడికి గురికా లేదన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు, అధికారు లతో కలిసి 2 కిలోమీటర్ల దూరం వాకింగ్ ట్రాక్‌పై నడకను కొనసాగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైస్‌చైర్మన్ వున్నం భారతి అంజనేయులు, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పాండు రంగ శ్రీను, కనిగిరి శ్రీను, వున్నం వెంకట్రావు, షేక్ బాబావలి, కామిశెట్టి రమేష్, వడ్డవల్లి సాంబశివ రావు, పణితి రవి, కుంచపు గంగరాజు, దూదేకుల ఖాశింసైదా, గండికోట వెంకటేశ్వర్లు, ఫరీద్‌మేస్త్రి, పిల్లి చెన్నారావు, బొల్లా శ్రీను, వున్నం సురేష్, కోట హరి, కొమ్మినేని రామచంద్రరావు, వున్నం శేషగిరి, కార్ సైదా, కమిషనర్ పి శ్రీధర్ తదితరులు పాల్గొ న్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక ● నియోజకవర్గ స్థాయి సమీక్ష

పిడుగురాళ్ల, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలో గురువారం ఉదయం జరిగే నియోజ కవర్గ స్థాయి గ్రీవెన్స్ (ప్రజాసమస్యల పరిష్కార వేదిక)తో పాటు మార్కెట్‌యార్డులో జరిగే నియో జకవర్గ స్థాయి అధికారుల సమీక్ష ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి పర్యవేక్షిం చారు. మండలాల వారీగా ఫిర్యాదులు స్వీకరించేం దుకు కౌంటర్ల ఏర్పాటు, అర్జీల స్వీకరణ కార్యక్ర మాన్ని క్రమ పద్ధతిలో కొనసాగించేలా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, సయ్యద్ అమీర్‌అలీ, ముప్పాళ్ల సాంబయ్య, మాజీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

ఎంపీపీ యడ్లపల్లి నారాయణ, తహసీల్దార్ మధు బాబు, కమిషనర్ పి.శ్రీధర్, ఎంపీడీఓ రామచంద్ర రావు, సీఐ వెంకట్రావు, విద్యుత్‌శాఖ ఏడీఏ నాగసు రేష్‌బాబు, ఏఈ సైదారావు తదితరులున్నారు.

భావితరాల కోసం ఆలోచించే నాయకుడు చంద్రబాబు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్


సాయిబాబా ఆలయ పూజల్లో పాల్గొన్న కొమ్మాలపాటి

పెదకూరపాడు, మే 14(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల కోసం ఆలోచన చేసే నాయకుడు ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. పెదకూర పాడులో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ యువతను పారి శ్రామికంగా ప్రోత్సహించేందుకు పెద్దఎత్తున రాయితీలను అందిస్తున్నట్టు తెలిపారు. యువ తకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, జిల్లా ప్రధానకార్యదర్శి భాష్యం ఆంజనేయులు, డిస్ట్రి బ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు, టీడీపీ మండల నేతలు మద్దినేని నరసింహారావు, షేక్ ముంతాజ్, బాలినేని బాబు, ఏటుకూరి బ్రహ్మయ్య, ఆంధ్ర ప్రసాదు, ఘంటా రామయ్య, జి.బాబు, షేక్ మ స్తాన్‌షరీఫ్, షేక్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వార్షిక పూజల్లో శ్రీధర్

పెదకూరపాడు, మే 14(ఆంధ్రజ్యోతి): పెదకూర పాడులోని సాయిబాబా దేవాలయ 24వ వార్షికోత్స వాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు ఘంటా బాబు కొమ్మాలపాటి శ్రీధర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అర్తిమళ్ళ రమేష్, భాష్యం ఆంజనేయులు, వడ్లమూడి అప్పారావు, బెల్లంకొండ రామగోపాల రావు పాల్గొన్నారు.

వృథాగా ప్రభుత్వ స్థలాలు

● అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలు
● వినియోగంలోకి కోరుతున్న ప్రజలు

క్రోసూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులో విలువైన ప్రభుత్వ స్థలాలు దశాబ్దాలుగా వృథాగా ఉన్నాయి.


వృథాగా ఉన్న ఆర్‌అండ్‌బీ బంగ్లా స్థలం


అడవిని తలపిస్తున్న కెనాల్స్ కార్యాలయ స్థలం

స్థానికులు ఆ స్థలాలను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. ఖాళీస్థలాల్లో అసాంఘిక కార్యకలాపాలు కూడా జరు గుతున్నాయని స్థానికులు వాపోతు న్నారు. 2007లో ఆర్‌అండ్‌బీ బంగ్లా కూలగొట్టడంతో అప్పటినుంచి ఖాళీగా ఉంది. సుమారు ఎకరంన్నర విస్తీర్ణంలో ఈ స్థలం వుంది. కెనాల్స్ ఆఫీసు స్థలం కూడా చాలా భాగం వృథాగా పడి ఉంది. స్థలంలో కొంతభాగంలో కెనాల్స్ కార్యాలయాలు ఉన్నప్పటికీ అవి మొత్తం శిథిలమైపోయాయి. సుమారు ఎకరం విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలంలోని కొంత భాగాన్ని రెవెన్యూ కార్యాలయ నిర్మాణానికి, మరి కొంత భాగాన్ని 108 అంబులెన్స్ భవన నిర్మాణానికి కేటా యించారు. మిగిలిన స్థలం వృథాగా ఉంది. క్రోసూరు వేణుగోపాలస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న గ్రామ కచేరి భవనం శిథిలమైపోయింది. సుమారు పది సెంట్ల స్థలంలో ఈ నిర్మాణం ఉంది. శిథిల భవనాన్ని కూల గొట్టి విలువైన స్థలాన్ని వినియోగంలోకి తేవా లని స్థానికులు కోరుతున్నారు. అలాగే రెడ్ల బజా రులో సుమారు 15 సెంట్ల బందిలదొడ్డి స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలాన్ని కూడా వినియోగం లోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.


శిథిలమైపోయిన గ్రామ కచేరి భవనం


ఖాళీగా ఉన్న బందిల దొడ్డి స్థలం

ఏపీఆర్జేసీలో కళ్యాణ్‌రామ్‌కు స్టేట్ ఫస్ట్ ర్యాంక్

పెదకూరపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్జేసీ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలలో పెదకూరపాడుకు చెందిన విద్యార్థి బాలినేని కళ్యాణ్‌రామ్ రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించాడు. అదేవిధంగా ఏపీ పాలిసెట్‌లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకును సాధించారు. కళ్యాణ్‌రామ్ తండ్రి రాజేంద్రబాబు వైజాగ్‌లోని దివీస్ ల్యాబ్స్‌లో మేనేజర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తుండగా తల్లి నాగలక్ష్మి గృహిణి. కళ్యాణ్‌రామ్ వైజాగ్‌లో ఆయా పరీక్షలను రాశారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాలలో 595/600 మార్కులు సాధించాడు. కళ్యా ణ్‌రామ్ స్వగ్రామం పెదకూ రపాడులో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పెదకూరపాడు ఎంపీడీవోగా ప్రభాకర్


డేవిడ్ ప్రభాకర్

పెదకూరపాడు, మే 14(ఆంధ్ర జ్యోతి): పెదకూరపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కొండా రెడ్డి డేవిడ్ ప్రభాకర్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తుళ్ళూరు ఈవోపీఆర్‌డీ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై పెదకూరపాడు ఎంపీడీ వోగా వచ్చారు. ఎంపీడీవోను సిబ్బంది కలసి శుభా కాంక్షలు తెలిపారు.

రాకుమార్ మృతదేహానికి రీపోస్టుమార్టం

అచ్చంపేట, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓర్వ కల్లు గ్రామానికి చెందిన కోటా రాకుమార్ మార్చి 22న కృష్ణా నదిలో పడి చనిపోయాడు. కావాలని చంపి ఉంటారనే అను మానంతో రాకుమార్ తల్లి, బంధువులు ఎస్పీని ఆశ్రయిం చారు. ఈ నేపథ్యంలో బుధవారం రాకుమార్ మృతదేహాన్ని వెలికితీసి రీపోస్టుమార్టం నిర్వహించారు. గుంటూరుకు చెందిన డాక్టర్ రమేష్‌బాబు, స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు.

బౌద్ధ కట్టడాల అభివృద్ధికి చర్యలు

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయిలో బౌద్ధ ఆరామంగా పేరుగాంచిన అమరావతిలోని మహాచైత్యం, పురావస్తు ప్రదర్శనశాలలను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ వీఎస్ బాడీజర్ తెలియజేశారని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు. బౌద్ధ కట్టడాల అభివృద్ధిపై ప్రధానమంత్రి కార్యాలయంలో సమర్పించిన వినతి పత్రానికి స్పందించిన పురావస్తుశాఖ డైరెక్టర్, వీరాంజనేయులుకు లెటర్‌ను అందజేసి అందులో మహాచైత్యం, పురావస్తు ప్రదర్శనశాల అభివృద్ధికి కృషి చేస్తా మని పేర్కొంది.

గాలిలో ప్రయాణం





మాచవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రంతాల్లో రైతులు, రైతు కూలీలు జానెడు పొట్ట కోసం ప్రాణాలను లెక్క చేయకుండా పరిమితికి మించి ట్రాక్టర్లు, ట్రాలీ ఆటో ల్లో ప్రయాణిస్తున్నారు. వేస వికాలం కావటంతో సుమా రు 15నుంచి 20 కిలోమీటర్ల దూరం వరకు మిర్చి, పొగా కు, మొక్కజొన్న కోతలకు వెళ్తుంటారు. ఇదే అదును గా ట్రాక్టర్లు, ఆటోల యజ మానులు పరిమితికి మిం చి కూలీలను ఎక్కించు కొని అతి వేగంతో తీసు కువెళ్తున్నారు.

పట్టణంలో భారీ వర్షం

సత్తెనపల్లి/సత్తెనపల్లి రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 4 గంటల వరకు ఎండతో ప్రజలు అల్లా డారు. 4.30 గంటల అనంతరం పట్టణంలో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీవర్షం కురిసింది. మండలంలోని లక్కరాజుగార్లపా డులో సత్తెనపల్లి ఏడుకొండలుకు చెందిన డాబాపై పిడుగుపడింది. పిడుగు ధాటికి పిట్టగోడ దెబ్బతిని పగుళ్ళిచ్చింది. గృహం లోని రెండు ఫ్యాన్‌లు, టీవీ, సెటప్ బాక్సులు పాడైపో యాయి. కొద్దిరోజులుగా మండుతున్న ఎండల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలు భారీ వర్షంతో సేద తీరారు.




రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు, పక్కన లక్కరాజుగార్లపాడులో పిడుగుపాటుకు దెబ్బతిన్న పిట్ట గోడ


గొట్టిపాళ్లలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● గురజాల డీఎస్పీ హనుమంతురావు

వెల్దుర్తి, మే 14(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గురజాల డీఎస్పీ హనుమంతరావు అన్నారు. మండలంలోని గొట్టిపాళ్ల, కొత్తపుల్లారెడ్డి, శిరిగిరిపాడు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్న విషయాలకు ఘర్షణలు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఏదైనా సమ స్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.


కంభంపాడులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పాపారావు

కంభంపాడులో గ్రామసభ

పెదకూరపాడు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడులో బుధ వారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు గ్రామసభను నిర్వహిం చారు. పార్టీ కార్యాలయ ప్రతినిధి కొండవీటి పాపారావు మాట్లాడుతూ అమ రావతి రాజధాని నిర్మాణంలో భాగస్వాములయ్యేందుకు రైతులు ముందుకురా వాలని, ల్యాండ్ పూలింగ్‌కు అవసరమైన భూమిని ఇవ్వాలని కోరారు. దీనిపై రైతులతో చర్చించారు. మండలంలోని బలుసుపాడులో కూడా గ్రామసభ నిర్వ హించారు. రైతులు భూములు ఇవ్వటానికి అధిక శాతం సుముఖంగా ఉన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, నియోజకవర్గ నాయకులు మాదినేని వెంకటసుబ్బయ్య, చిరుమామిళ్ళ శౌరయ్య, వెంకటాయపాలెం సురేష్, అర్తిమళ్ళ శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు, వడ్లమూడి అప్పారావు, ఏటుకూరి రత్నకుమార్ తదిత రులు పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలలుగా మూడు అప్‌గ్రేడ్

రెంటచింతల, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచికల్లు, ఆంజనేయ స్వామి మాన్యం, మల్లవరం గ్రామాల్లోని అప్పర్ ప్రైమరీ పాఠశాలలను జిల్లా పరిషత్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి విజయరామ రాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 140మంది టీచర్లకు గాను సీనియర్ అసిస్టెంట్లు 18మంది మిగులుగా ఉండగా 16మంది ఎస్‌జీటీల కొరత వుందన్నారు. మండలంలో 10 మోడల్ ప్రైమరీ పాఠశాలలు, 8 బేసిక్ ప్రైమరీ స్కూళ్లు, 4 ఫౌండేషన్ స్కూళ్లు (1నుంచి 2వ తరగతుల వరకు) వున్నాయన్నారు.

మండుటెండలో తాగునీరు.. అన్నదానం

మాచర్ల రూరల్, మే 14 (ఆంధ్రజోతి): స్వామి వివేకానంద చారిట బుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యాన మాచర్లలో బుధవారం ఉచిత మొబైల్ కూలింగ్ మినరల్ వాటర్, పల్లెటూర్ల నుంచి తాటిముంజలు విక్రయించుకునేందుకు వచ్చినవారికి ఉచితంగా అన్న దానం నిర్వహించారు. గోవిందరెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మి డెయిరీ అధి నేత నర్రా వెంకటనరసయ్య ఆధ్వర్యాన మొబైల్ ఉచిత కూలింగ్ మినరల్ వాటర్‌ను పట్టణంలో ప్రతి సెంటరుకు తిరుగుతూ ప్రజల దాహార్తిని తీరు స్తున్నామన్నారు.

17న ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణమేళా

దుర్గి, మే 14 (ఆంధ్రజ్యోతి): దుర్గి ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 17వ తేదీన ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణమేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివప్రసాద్ బుధవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరూ సంబంధిత అర్హత సర్టిఫికెట్స్‌ను తీసుకొని హాజ రుకావాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, కుల, ఆదాయం, ఆధార్, రేష న్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో రావాలన్నారు. ఈ రుణ మేళాకు బ్యాంకు మేనేజర్లు, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు హాజరవుతార న్నారు. అలాగే క్రిస్టియన్స్, ముస్లిం మైనార్టీలకు కూడా రుణమేళా నిర్వ హించడం కోసం ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. అర్హతగల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ప్రజలకు సత్వరమే సేవలందించాలి

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం సచి వాలయాలకు వచ్చే ప్రజలకు సత్వర సేవలందించాలని ఎంపీడీవో టీ పార్వతి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ధరణికోట గ్రామంలోని రెండు సచివాల యాలను ఎంపీడీవో ఆకస్మికంగా సందర్శించి సిబ్బంది హాజరు, రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ, సిబ్బంది పనితీరు పరిశీలించారు. ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశించారు.

యరపతినేని పరామర్శ

పిడుగురాళ్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): తుమ్మలచెరువుకు చెందిన టీడీపీ కార్యకర్త గాలి మోహన్‌రావు బుధవారం మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గ్రామానికి వెళ్లి మోహన్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించి మోహన్‌రావు మృతదేహానికి నివాళులర్పించారు. పార్టీ తరుపున, తన వ్యక్తిగతంగా మోహన్‌రావు కుటుంబసభ్యులకు అండగా వుంటానని భరోసా ఇచ్చారు.

నవీన్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం


నవీన్ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న నేతలు

గురజాలటౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేదీన యూరప్‌లోని సైప్రస్ దేశంలో గురజాల పట్టణానికి చెందిన నల్ల నవీన్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. టీడీపీ యువనేత యరపతినేని నిఖిల్‌బాబు ఆలోచనల మేరకు అమెరికాలో నివాసముంటున్న మండలంలోని మాడుగుల టీడీపీ యువ నేత యేచూరి సతీష్ రూ.లక్ష ఆర్థికసాయం పంపారు. ఈ నగదును బుధవారం జగదీష్, లేళ్ల సాంబశివరావు, మాచర్ల నాగేశ్వరరావులు నవీన్ కుటుంబసభ్యులకు అందించారు.

వినోదాన్ని పంచుతున్న సింగిల్

● హీరో శ్రీ విష్ణు



గుంటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్ చిత్ర హీరో శ్రీ విష్ణు

నరసరావుపేట కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి). ఇటీవల విడుదలై ప్రేక్షకుల ఆదరణ పొందుతున్న సింగిల్ చిత్రం హీరో శ్రీ విష్ణు, హీరోయిన్లు కేతిక శర్మ, ఇవానాలు బుధవారం ఆ సినిమా ప్రదర్శిత మౌతున్న కాసు సెంట్రల్‌లోని గీతా మల్టీప్లెక్స్‌కు విచ్చేశారు. హీరో, హీరోయిన్ల రాక గురించి తెలుసుకున్న అభిమానులు భారీగా తరలివచ్చారు. థియేటర్ యాజమాన్యం వారికి ఘనంగా స్వాగతం పలికారు. తొలుత మాల్‌లో ఏర్పాటు చేసిన వేదికపైన అభిమానుల నడుమ సందడి చేసారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు హీరో అభివాదం చేసారు. అనంతరం సినిమా ప్రదర్శితమౌతున్న స్క్రీన్‌కు విచ్చేసి థియేటర్‌లోని ప్రేక్షకులకు అభివాదం చేసారు. సింగిల్ సినిమాని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే హీరోయిన్ కేతిక శర్మ ప్రేక్షకులకు అభివాదం చేసారు. హీరో, హీరోయిన్ల రావడంతో కాసేపు సినిమా ప్రదర్శనను నిలిపివేశారు. ఈ సందర్భంగా అభిమానులు సందడి చేశారు. అనంతరం హీరో శ్రీ విష్ణు మీడియాతో మాట్లాడుతూ తను ఈ సినిమా కథ వింటున్నప్పుడు బాగా ఎంజాయ్ చేశానని, ఇప్పుడు ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తుంటే ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమాలో ఫన్ క్రియేట్ చేయడం కోసం డిఫరెంట్ మాడ్యులేసన్ ట్రై చేసానన్నారు. గీతా వంటి పెద్ద బేన ర్‌లో పనిచేయడం గర్వం గా ఉందన్నారు. ఇదే జోనర్‌లో మరిన్ని సినిమాలు చేస్తానన్నారు.

గుంటూరులో..

గుంటూరు(తూర్పు), మే 14(ఆంధ్రజ్యోతి): సింగిల్ సినిమా ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుందని హీరో శ్రీ విష్ణు ఆనందాన్ని వ్యక్తం చేశారు. విజయయాత్రలో భాగంగా బుధవారం నగరంపాలెం ఫినిక్స్ మాల్‌లో సినిమా యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు చేసిన సినిమాల్లో సింగిల్ మరింత సంతృప్తి నిచ్చిందని అన్నారు. భవిష్యత్తులో మంచి పాత్రలను ఎంపికచేసుకుని ప్రేక్షకులను మెప్పిస్తానని చెప్పారు. దర్శకుడు కార్తీక్ రాజు మాట్లాడుతూ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. హీరోయిన్లు కేతిక శర్మ, ఇవానా మాట్లాడుతూ సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు, శ్రీ విష్ణు అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫినిక్స్ మాల్ యాజమాన్యం, పంపిణీ దారులు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల వరివంగడాలకు బహు డిమాండ్

ఫౌండేషన్ సీడ్ విక్రయాలకు ఏర్పాట్లు

మూడు రాష్ట్రాలు నుంచి రైతుల ఆర్డర్



బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం కార్యాలయం

బీపీటీ.. ఘనాపాఠి

బాపట్ల, మే14 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వరివంగడాలకు బహుడిమాండ్ ఉంది. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం నందు ఎంపిక చేసిన పంటలను పండించి ఫౌండేషన్ సీడ్ తీసి ప్రతి ఏడాది రైతులకు విక్రయిస్తూ ఉంటారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందించేందుకు నాలుగు రకాల విత్తనాలను ఎంపికచేసి పండించి ఫౌండేషన్ సీడ్ సిద్ధం చేశారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీవారు వీటిని ధ్రువీకరించారు. నాణ్యతకు సంబంధించిన ట్యాగ్‌లు వచ్చిన వెంటనే విత్తనాలు విక్రయించనున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన బీపీటీ 5204 (సాంబ మసూరి) విత్తనాల కోసం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి 300మంది రైతులు పోస్ట్‌కార్డుల ద్వారా 3వేల బ్యాగ్‌లు కావాలని కోరారు. అదేవిధంగా బీపీటీ 2270 (భావపురి సన్నాలు) విత్తనాలు 3వేల బ్యాగ్‌లు కావాలని రైతులు పోస్ట్‌కార్డులు పంపించారు. అలాగే బీపీటీ 2782 (భవతి), బీపీటీ 2595 (తేజ) రకాల విత్తనాలు కూడా కావాలని పోస్ట్‌కార్డులు పంపించారు. ప్రస్తుతం వ్యవసాయ క్షేత్రంవారు ఈ నాలుగు రకాల విత్తనాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఒక్కొక్క బ్యాగ్ 30కిలోలు ఉంటుంది. కిలోఫౌండేషన్ విత్తనాల ఖరీదు 47 రూపాయల వరకు ఉంటుంది. విత్తనాల కోసం రైతులు పోటీపడటం పరిపాటి కాగా ముందుగా లేఖలు పంపిన వారికే ప్రాధాన్యం ప్రకారం విత్తనాలు ఇవ్వటం జరుగుతుంది.

ట్యాగ్‌లు వచ్చిన వెంటనే విక్రయాలు ప్రారంభిస్తాం : వ్యవసాయ క్షేత్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ అరుణ



బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రంలో నాలుగు రకాల వరిపంటలను సాగు చేయటం జరిగింది. అందులో బిపిటి 5204, బిపిటి 2270, బిపిటి 2782, బిపిటి 2595 ఉన్నాయి. మొత్తం 1560క్వింటాళ్ళ ఫౌండేషన్ సీడ్ సిద్ధంగా ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీవారు నాణ్యతను పరిశీలించి ఒకే చేశారు. ట్యాగ్‌లు రాగానే 30కిలోల బ్యాగ్‌లను విక్రయించటం జరుగుతుంది. జనవరి నుండి అనేక ప్రాంతాల రైతులు విత్తనాల కోసం లేఖలు పంపించారు. ప్రాధాన్యత ప్రకారం విత్తనాలు ఇవ్వటం జరుగుతుంది. ముందుగా పోస్ట్‌కార్డులు పంపించిన వారికి ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతుంది.



ప్రాచుర్యం పొందిన బీపీటీ-2270, 5204 వరిపైరు



108కి.. సుస్తీ...

(5వ పేజీ తరువాయి)

కూయలేకపోతున్నాయి. లైట్లు వెలగనంటున్నాయి. ఇంతవరకు పనిచేయకున్నా, కనీసం రోగిని సకాలంలో ఆసుపత్రికైనా తీసుకెళతాయా! అంటే అదీ నమ్మకంలేదంటున్నాయి... ప్రస్తుతం ఉన్న పాత 108 వాహనాల తీరు. ఈ మధ్య కాలంలో చాలాచోట్ల ఈ వాహనాలు మొరాయిస్తూ కనిపిస్తూనే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రతి మండలానికి ఒక 108 వాహనం ఏర్పాటు చేశారు. కొన్నిటికి మండల కేంద్రాల్లో నిలిపే వసతి, సిబ్బంది వేచిఉండేందుకు ఏర్పాట్లు లేక చాలాచోట్ల నియోజకవర్గ కేంద్రాల్లో ఉండిపోతున్నాయి. గుంటూరు జిల్లాలో 18 మండలాలకుగాను 18 మండలాలకు 18 వాహనాలు, బాపట్ల జిల్లాలో 25, పల్నాడు జిల్లాలో 28 మండలాలకు 28 వాహనాలు కలిపితే, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 71 వాహనాలున్నాయి. అయితే వీటిలో చాలావరకు 2 నుంచి 2.5 లక్షల కిలోమీటర్లు ఇప్పటికే తిరిగేసినవి ఉంటే, మరికొన్ని అంతకు మించి తిరిగినవీ ఉన్నాయి. వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటుచెయ్యాల్సిఉన్నా, గత ప్రభుత్వం భారీగా మార్పులు చేస్తున్నామంటూ 2020లో 146 వాహనాలను, తర్వాత మరికొన్నిటిని రాష్ట్రంలో కొనుగోలు చేసింది. అయితే వీటిలో మన జిల్లాకు పెద్దగా దక్కినవి లేవు. పైగా పాతవాటికి పెద్దగా మరమ్మతులు చేయించిందీ లేదు.

కొత్తగా... అదనంగా అవసరం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 71 మండలాలుంటే, వాటికి ఒక్కొక్క మండలానికి ఒక 108 వాహనం ఉంది. అయితే వీటిలో 40 శాతం వాహనాలు సాధ్యమైనంత త్వరగా మార్చి కొత్తవాటిని ఏర్పాటుచెయ్యాల్సిఉంటే, మరికొన్నిటిని పూర్తిస్థాయి మరమ్మతులు చేయించాల్సిఉన్నాయి. కొన్నిటికైతే టైర్లు అరిగిపోయి, పంక్చర్‌లు పడేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటితోపాటే, మరికొన్ని 104 వాహనాలదీ అదే పరిస్థితి. టైర్లు పాడయిపోయి, కొత్తవాటికోసం ఎదురు చూస్తున్నాయి. ఇదిట్లాఉంటే... రాజధాని ప్రాంతం కావటం, అవసరాలు పెరగటం, జాతీయ రహదారులపై ప్రమాదాల సంఖ్య పెరిగిపోతుండటంతో అదనపు వాహనాల అవసరం కూడా ఉంది. గుంటూరు నగరంలో ఈస్ట్, వెస్ట్ మండలాలకు రెండే ఉన్నాయి. నగరం పెద్దదే అయినా మరో రెండు వాహనాల అవసరం ఉన్నా, ఈ రెండిటితోనే చాలాకాలంగా నెట్టుకొస్తున్నారు. కొత్త జిల్లాలు ఏర్పడ్డాక పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో, బాపట్లలో ఒక్కొక్క వాహనం సరిపోకపోగా, అవీ పాతవి కావటంతో తిప్పలు తప్పటంలేదు. వీటికి అత్యవసర మెరుగైన వైద్యసేవలు అవసరమైతే గుంటూరు సమగ్ర వైద్యశాలకు రావలసిందే. ఈ నేపథ్యంలో ఆయా కొత్త జిల్లా కేంద్రాల్లోనే అదనపు వాహనాలు తప్పనిసరి. ఇవికాక బాపట్ల జిల్లా, ప్రకాశం జిల్లాల సరిహద్దుల్లో గ్రామాలు, దూరంగా ఉండటం, రవాణా సదుపాయాలు సరిగాలేకపోవటం, మెరుగైన వైద్యం కావాలంటే ఒంగోలుకే వెళ్లాల్సిరావటంతో దూరం పెరిగిపోయి, ఇబ్బందులు పడుతున్నవారూ ఉన్నారు.

190 కొత్త వాహనాలొస్తున్నాయ్... ఏజన్సీకూడా మారుతుంది


సత్యన్నారాయణ, 108 సర్వీసుల రాష్ట్ర పర్యవేక్షకుడు

పాతబడిపోయి, రిపేర్లకు గురవుతున్న వాహనాలను ఇప్పటికే గుర్తించాం. వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు 190 కొత్తవాటిని కొనేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. త్వరలో అవికూడా సమకూరతాయి. ఏజన్సీ కూడా మారబోతోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కూడా పూర్తయింది. మరో వారంలో కొత్త ఏజన్సీ బాధ్యతలు తీసుకుంటుంది. ప్రభుత్వం వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి ప్రక్షాళన చేయదలచుకుంది. త్వరలో అన్నీ అందుబాటులోకి వచ్చేస్తాయి. పాతవి ఉన్నా, ఏ ఇతర ఇబ్బందులు ఉన్నా, రాష్ట్రంలో ఎక్కడా ఒక్క రోగికి కానీ, అత్యవసర చికిత్స అవసరమైనవారికి కానీ ఇబ్బంది రానివ్వకుండా, ప్రాణాపాయం లేకుండా కాపాడగలిగాం. భవిష్యత్‌లో మరింత మెరుగైన సేవలు అందేలా జాగ్రత్తలు తీసుకుంటాం.

బర్లీ పొగాకు కొనుగోళ్లపై రైతుల అసంతృప్తి

● రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

● 28న సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి పిలుపు



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, పాల్గొన్న రైతు సంఘం నాయకులు

గుంటూరు(తూర్పు), మే 14 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు కొనుగోళ్లపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం బుధవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ పంట తాము కొనుగోలు చేస్తామంటూ రైతులకు సంతకం లేని బాండ్లు ఇచ్చిన కంపెనీలు తీరా ఇప్పుడు తాము కొనుగోలు చేయలేమంటూ ముఖం చాటేశాయన్నారు. పొగాకు సాగుచేసిన రైతులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడి చేపట్టాలని పిలుపు నిచ్చారు. రైతులను మోసం చేసిన కంపెనీలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ గత ఏడాది 50 మిలియన్ కేజీలు పొగాకు కొనుగోలు జరిగిందని, ఈ సంవత్సరం అసలు కొనుగోళ్లు జరగకపోవడం దుర్మార్గమన్నారు.రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై కేశవరావు, వి.కృష్ణయ్య, పి.జమలయ్య, డాక్టర్ కొల్లా రాజమోహన్, లలిత తదితరులు మాట్లాడుతూ వ్యవసాయ శాఖమంత్రి, అధికారులు గత నెల 29న కంపెనీల యజమానులు, అధికారులు, రైతు సంఘాలు, పొగాకు రైతులతో సమావేశం నిర్వహించి నల్లబర్లీ కొనాల్సిందేనని హెచ్చరించినా ఒక్క కిలో కూడా కొనుగోలు జరగ లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్ పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేయించ డంలో విఫలమైందన్నారు. తొలుత పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ రైతు సంఘాల నాయకులు సమావేశమయ్యారు. పొగాకు రైతు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా రై తుల సమస్యలు, రైతు సంఘాల అభిప్రాయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్త తానని చైర్మన్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. సమావేశంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ, వి.హనుమారెడ్డి, కె.వీరారెడ్డి, కంచుమాటి అజయ్ కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

సర్వర్.. సంకటం!



● మొరాయిస్తున్న రైస్ కార్డు సర్వర్
● మూడు రోజులుగా అదే పరిస్థితి
● వందల్లో వస్తున్న దరఖాస్తులు..
● రోజుకు ఒకటి రెండు దరఖాస్తులతో సరి
● తలలు పట్టుకుంటున్న సచివాలయ సిబ్బంది
● నిబంధనల గందరగోళంతో కార్డుదారుల్లో కలవరం

గుంటూరు, మే 14(ఆంధ్రజ్యోతి): రైస్‌కార్డుల దరఖాస్తులను సర్వర్ సమస్యలు వెంటాడుతున్నాయి. రైస్ కార్డుల దరఖాస్తుకు అవకాశం కల్పించి ఇప్పటికి పది రోజులు అవుతున్నా దరఖాస్తుల ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన 30 రోజుల గడువులో ఇప్పటికే పది రోజుల గడువు పూర్తైపోవడంతో కార్డుదారుల్లో కలవరం మొదలయింది.

గత వైసీపీ హయాంలో రైస్‌కార్డుల ప్రక్రియ అస్తవ్యస్తంగా జరగడంతో నిజమైన లబ్దిదారులు కార్డులు పొందలేకపోయారు. దీనికితోడు నిబంధనల పేరుతో ఆ ప్రభుత్వం అనేకమంది కార్డులు తొలగించింది. వారంతా ఏళ్ల తరబడి రైస్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం రైస్ కార్డుల దరఖాస్తుకు అవకాశం కల్పించడంతో వారంతా రైస్ కార్డుల కోసం క్యూ కట్టారు. దీంతో ప్రతి సచివాలయానికి రోజుకు 10 నుంచి 20 వరకూ దరఖాస్తులు వస్తున్నాయి. దరఖాస్తుల ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. సర్వర్ రాకపోవడంతో రోజుకు ఒకటి రెండు కంటే ఎక్కువ దరఖాస్తులు చేయడానికి వీలు కావడం లేదు.

గాడిన పడని వెబ్ పోర్టల్

రైస్ కార్డు దరఖాస్తులకు సంబంధించి పౌరసరఫరాల శాఖ అందుబాటులోకి తెచ్చిన సర్వర్ సమస్యలతో ముందుకు కదలడం లేదు. కార్డుల విభజన, అడ్రస్ మార్పు, మరణించినవారి పేర్ల తొలగింపు, కొత్తగా పుట్టిన చిన్నారుల పేర్ల చేర్పు, రైస్ కార్డు సెరండర్, కొత్త కార్డుల మంజూరు వంటి సదుపాయాలకు అవకాశం కల్పించారు. అయితే అవేవీ పనిచేయడం లేదు. కేవలం పేర్ల చేర్పు, కొత్త కార్డుల దరఖాస్తులు మినహా మిగిలిన ఆప్షన్లు వెబ్‌పోర్టల్లో కనిపించడం లేదని ఉద్యోగులు దరఖాస్తుదారులను తిప్పి పంపి స్తున్నారు. దరఖాస్తు ప్రక్రియ మొదలైననాటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఇదిగో అదిగో అనుకుంటూనే పదిరోజులు గడిచిపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఈనెల 12వ తేదీ నుంచి వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా దరఖాస్తుకు అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. అది కూడా అందుబాటులోకి రాలేదు. సొంతగా దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ పోర్టల్ కూడా ఇప్పటి వరకూ అందుబాటులోకి రాలేదు.

నిబంధనల్లో గందరగోళం..

రైస్ కార్డు దరఖాస్తులకు సంబంధించి నిబంధనల్లోనూ గందరగోళం నెలకొంది. లబ్దిదారుల ఎంపికలో సిక్స్‌స్టెప్ వెరిఫికేషన్ తప్పనిసరి అని సిబ్బంది చెబుతున్నారు. కాగా సంబంధిత శాఖ అధికా రులు త్రీ స్టెప్ వెరిఫికేషన్ మాత్రమే ఉంటుందని చెబుతున్నారు. అయితే అవి కూడా వెబ్ పోర్టల్లో అందుబాటులోకి రాలేదు. దీంతో సిక్స్ స్టెప్ వెరిఫికేషన్‌కు అనుగుణంగానే దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోంది. కొత్తగా పెళ్లయినవారికి పెళ్లి శుభలేక, పెళ్లిఫోటో ఉంటే సరిపోతుందని చెబుతున్నారు. కాగా మ్యారేజ్ సర్టిఫికేట్ ఉంటేనే తప్ప దరఖాస్తు చేయడానికి వీలు కాకపోవడంతో సచివాలయ సిబ్బంది తిప్పిపంపుతున్నారు. దీంతో రైస్‌కార్డుల దరఖాస్తుల ప్రక్రియ ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్నట్లుగా సాగుతోంది. దరఖాస్తు ప్రక్రియపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకుంటే ఈసారి కూడా రైస్‌కార్డు ఆశావహులకు నిరాశ తప్పదు.

బర్లీ మంటలు..!

(5వ పేజీ తరువాయి)

దిగి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరపడమే ఈ సమస్యకు పరిష్కారం అని రైతులు చెబుతున్నారు. లేదంటే మరింత మంది రైతులు బలికాక తప్పదని అంటున్నారు.

అప్పులు తీర్చలేని పరిస్థితి



12 ఎకరాలు కౌలుకు తీసుకుని బర్లీ పొగాకు సాగు చేశాను. ఎకరానికి లక్షన్నర వరకు పెట్టుబడి ఖర్చు అయింది. ఇప్పుడు చూస్తే కనీసం కొనేవాడు కనబడడం లేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. అప్పులు తీరే మార్గం కనబడడం లేదు

-తులసి శంకర్, పర్చూరు

కంటిమీద కునుకు ఉండడం లేదు

ఓ పక్క పొగాకును అడిగే వారే కనబడడం లేదు. మరో వైపు పొంచి ఉన్న వర్షాలతో కంటిమీద కునుకు ఉండడం లేదు. ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. కంపెనీలు కన్నెత్తి కూడా చూడడం లేదు. చేతికి అంది వచ్చిన పంటను అమ్ముకోవడానికి నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. ప్రభుత్వమే ఆదుకోవాలి



-పీ శ్రీనివాసరావు, ఉప్పుటూరు గ్రామ రైతు

కూల్‌గా.. రూ.కోట్లు




◆ వేసవి తాపం రూ.100 కోట్లకు పైనే వ్యాపారం
◆ జోరుగా మజ్జిగ, శీతల పానీయాలు అమ్మకాలు
◆ రోజుకు కోటిన్నర బీరు తాగి మందుబాబుల ఉపశమనం



గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): వేడెక్కిన వాతావరణంలో కూల్‌గా ఉపశమనం పొందుతున్నారు. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ దాటేసింది. పైగా ఉక్కపోత, వడగాడ్పులతో ప్రజలు అల్లాడుతున్నారు. వేడిమితో కూడిన వాతావరణంలో నోరు పిడచ కట్టుకుపోతోంది. చల్లటి మంచినీరు తాగినా తపన తీరకపోవడంతో ఒక్కొక్కరు ఒక్కో రకం శీతలపానీయాలు సేవిస్తూ సేద తీరుతున్నారు. దీంతో అటు వేడి.. ఇటు సేద తీరేందుకు ప్రజలు ఎక్కువగా మజ్జిగ, శీతల పానీయాలతో ఉపశమనం పొందుతున్నారు. ఇక మందుబాబులైతే బీరుతో సేద తీరుతున్నారు. మండే ఎండల్లో మ జ్జిగ, శీతల పానీయాలు, బీర్ల అమ్మకాలు జోరం దుకుంటున్నాయి. ఆయా వ్యాపారాలు రూ.కోట్ల లో జరుగుతున్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. కొబ్బరినీళ్ల బాటిల్ రూ.100 విక్రయిస్తున్నా ప్రజలు వెనుకాడకుండా కొనుగోలు చేస్తున్నారు. చెరుకురసం లీటర్ రూ.50కు లభిస్తున్నాయి. డెయిరీలు చల్లటి మజ్జిగను ప్రజలకు అందు బాటులోకి తెచ్చాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా లో సంగం డెయిరీ ద్వారానే రోజుకు 3 లక్షల 80 వేల ప్యాకెట్ల అమ్మకాలు జరుగుతున్నాయి. మిగతా డెయిరీల మజ్జిగ ప్యాకెట్లు మరో లక్షా 20వేల వరకు అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ లెక్కన రోజుకు చల్లటి మజ్జిగ కోసం రూ.50 లక్షలు ఖర్చు పెడుతున్నారు. ఇవి కాకుండా ఇతరత్రా శీతల పానియాలైన కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, చెరుకు రసం, కొబ్బరిబోం డాలు వంటి వాటిని సేవించటం ద్వారా ప్రజలు సేద తీరుతున్నారు. ముఖ్యంగా ఎక్సైజ్ శాఖకు ఈ ఎండాకాలం ఎంతో కలిసి వచ్చింది. చల్లటి బీరు కోసం మందుబాబులు బారులు తీరుతు న్నారు. కొన్ని ప్రాంతాల్లో డిమాండ్‌కు తగ్గట్లుగా బీరును సరఫరా చేయలేని పరిస్థితి నెలకొన్నది. ఏప్రిల్ ఒకటి నుంచి మే 13 వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2 లక్షల 79వేల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి. అంటే 33 లక్షల 48 వేల బీరు సీసాల అమ్మకాలతో ప్రభుత్వ ఖజానాకు రూ.62.6 కోట్లు సమకూరాయి. రోజుకు కేవలం బీరు కోసమే మందుబాబులు రూ.కోటిన్నర ఖర్చు పెడుతున్నారు.



శీతల పానియాలు తాగుతూ..



రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి: తహసీల్దార్

రొంపిచర్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల ప్రజలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బండి నిర్మల బుధవారం తెలిపారు. ఆరు రకాల సర్వీసులు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. మార్పులు, చేర్పులు, కొత్తవి, తొలగింపులు, విభజించటం వంటి సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. జనన ధృవీకరణ పత్రం, వివాహ ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ వంటి పత్రాలు సచివాలయాలకు తీసుకు వెళ్ళాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం వాటిని పరిశీలిస్తామని తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పండ్ల మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీవో

వినుకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న పండ్ల మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రవికుమార్ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హార్టికల్చర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పండ్ల తోటల పెంపకంపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి నబీరసూల్, ఏవో జి.వరలక్ష్మి, ప్లాంటేషన్ మేనేజర్ శిరీషా, ఏపీవో కట్టా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాపీ వర్కర్ల ఆత్మీయ సమావేశం

వినుకొండ టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెడికల్ అసోసియేషన్ కార్యాలయంలో వినుకొండ నియోజకవర్గంలోని తాపీ వర్కర్ల ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి డెక్కన్ సిమెంట్ టెక్నికల్ సిబ్బంది శ్రీనివాసరావు సిమెంటు ప్రాధాన్యంపై వివరించి మేస్త్రులకు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో గోపి, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీఎస్ సుజాత పదోన్నతిపై రేపల్లెకు బదిలీ

చిలకలూరిపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా ఉన్న కె సుజాత ప్రమోషన్‌పై టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా రేపల్లె మునిసిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమె స్థానంలో ఇప్పటివరకు ఇక్కడ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న పి.వెంకటేశ్వరరావు టీపీఎస్‌గా వ్యవహరిస్తారు.

నేడు కొచ్చర్ల అంకాళ పరమేశ్వరి తిరునాళ్ల

ఈపూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చర్ల గ్రామంలోని అంకాళ పరమేశ్వరి అమ్మవారి తిరునాళ్ల గురువారం నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకొని చుట్టుపక్కల గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకుంటారు. కొచ్చర్ల, కొండ్రముట్ల గ్రామస్థులు ఆరు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ నూతన గ్రామ కమిటీల ఎన్నికలు

శావల్యాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచి, వయ్యకల్లు, శానంపూడి గ్రామాలలో టీడీపీ నూతన గ్రామకమిటీ ఎన్నికలను బుధవారం నిర్వహించారు. కారుమంచి టీడీపీ అధ్యక్షుడిగా ముప్పా గిరిప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బొమ్మినేని పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా మల్లాపరపు నరసయ్య ఎన్నికయ్యారు. వయ్యకల్లు టీడీపీ అధ్యక్షుడిగా నడింపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా బొమ్మినేని పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా పాలెపోగు గాలెయ్య ఎన్నికయ్యారు. శానంపూడి టీడీపీ అధ్యక్షుడిగా వంకాయలపాటి వరదయ్య, ఉపాధ్యక్షుడిగా అమృతపూడి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా చిమటా కాశయ్య ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను సీనియర్ నేతలు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, సీనియర్ నేతలు జి.విశ్వనాథం, వై.కోటేశ్వరరావు, జి.హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, బి.పేరయ్య, డి.ఏడుకొండలు, జి.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల జీవనోపాధి మెరుగుపర్చడమే లక్ష్యం: డీపీఎం

శావల్యాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల జీవనోపాధి మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని డీఆర్‌డీఏ వెలుగు డీపీఎం చిన్న శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామసంఘం అసిస్టెంట్లకు యాన్యువల్ క్రెడిట్ జీవనోపాధుల నుంచి సూక్ష్మ రుణ ప్రణాళికలపై బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీపీఎం మాట్లాడుతూ క్లస్టర్ సీసీలు, వీవోఏలు గ్రామాల్లో రోజుకు 20 డ్వాక్రా గ్రూపులతో సమావేశాన్ని నిర్వహించి సభ్యులందరితో బయోమెట్రిక్ వేయించాలన్నారు. ఇప్పటినుండి డిజిటల్ ఎంపీసీల ద్వారానే బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ తదితర రుణాలకు సీసీలు బయోమెట్రిక్ వేశాక ఏపీఎం లాగిన్‌లో అప్రూవల్ అవుతుందన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు జి. భార్గవి.కార్యదర్శి వి.కుమారి, వెలుగు ఏపీఎం జి.వాసుబాబు, స్త్రీనిధి మేనేజర్ రాహుల్, సీసీలు రామారావు, మేరీకుమారి, కరుణమ్మ అకౌంటెంట్ వెంకాయమ్మ పాల్గొన్నారు.

చెట్టు కొమ్మ విరిగి ఇద్దరికి గాయాలు

నాదెండ్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందవరం పరిధిలో బుధవారం సాయంత్రం చెట్టు కొమ్మ విరిగి పడి ఇద్దరు మహిళలు గాయపడ్డారు. గ్రామానికి చెందిన పీ అరుణ, టి.లక్ష్మిలు మిర్చి కల్లాల్లో తాలుగాయలు వేరేందుకు వెళ్ళారు. సాయంత్రం 4 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో గాలి వీచి వర్షం రావటంతో సమీపంలో ఉన్న చెట్టు కిందకు వెళ్ళారు. గాలికి చెట్టు కొమ్మ విరిగిపడి ఇద్దరూ గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

అనాలోచిత నిర్ణయంతో ప్రజాధనం వృథా



జగనన్న కాలనీలో తక్కువ దూరంలో వేసిన విద్యుత్ స్తంభాలు, పక్క పక్కనే ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

- జగనన్న కాలనీకి ట్రాన్స్‌ఫార్మర్ల పేరుతో దుబారా
- అవసరానికి మించి ఏర్పాటు
- మూడేళ్లుగా నిరుపయోగంగా..

వినుకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రభుత్వానికి పన్నుల రూపాన చెల్లించిన ప్రతి రూపాయి మళ్లీ ప్రజా అవసరాలకు జాగ్రత్తగా ఉపయోగించాల్సి ఉండగా, దీనికి విరుద్ధంగా గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో ప్రజాధనాన్ని వృథా చేసింది. దీనికి ఉదాహరణ వినుకొండ పట్టణానికి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న జగనన్న కాలనీకి కరెంటు పేరుతో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది. ఈ కాలనీలో పట్టణ పేదల కోసం 4637 ఇళ్ల ఏర్పాటు చేసింది. ఒక సెంటు స్థలంలో కట్టిన ఇంటికి ఫ్యాన్, టీవీ, 4 బల్బులు తదితర విద్యుత్ వాడటానికి సుమారు 500 కిలోవాట్స్ అవసరం ఉంటే గత వైసీపీ ప్రభుత్వం దానికి రెట్టింపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేయగా మూడేళ్ల నుంచి అవి నిరుపయోగంగా మారాయి. నివాసానికి వీలు కాని ప్రాంతంలో జగనన్న కాలనీల పేరుతో ఇళ్లు కట్టి కాంట్రాక్టర్ల కోసం ప్రజాధనాన్ని వృథా చేసింది. ఇళ్లు కాదు గ్రామాలు కడుతున్నామని గొప్పలు చెప్పుకున్న వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా నిధులు ఖర్చుచేశారు. వినుకొండ పట్టణ పేద ప్రజల కోసం జాలలపాలెం పరిధిలో 100 ఎకరాల్లో లేఔట్ వేశారు. ఈ లేఔట్‌లో 4637 ఇళ్ల నిర్మాణం తలపెట్టారు. విద్యుత్ కోసం 100 కేవీ సామర్థ్యం కలిగిన 80 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. 60మీటర్ల దూరంలో వేయాల్సిన స్తంభాలు 30 మీటర్లకే వేశారు. ఇదంతా కాంట్రాక్టర్లకు దోచిపెట్టడమే తప్ప ప్రజలకు అదనంగా ఒరిగేదేమీ లేదు. జగనన్న కాలనీలో ఉన్న గృహాలకు అధికారికంగా ఒక ఇంటికి కూడా విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన దాఖలాలు లేవు. కాలనీలో స్ట్రీట్ లైట్లు మాత్రమే విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఇవే ట్రాన్స్‌ఫార్మర్లు వినుకొండ పట్టణంలో ఏర్పాటు చేసినట్లయితే లో ఓల్టేజీ సమస్య తీరిపోయేది. వినుకొండ పట్టణంలో లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అవసరం ఉన్నచోట చేపట్టాల్సిన పనులు అవసరం లేనిచోట కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం కోసం ప్రజాధనాన్ని వృథా చేశారు. ఈ కాలనీలో ఉన్న వీధిలైట్లు పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ప్రజాధనం వృథా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పగలే వెలుగుతున్న వీధి దీపాలు



బల్లలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ప్రభుత్వ వైద్యశాలకు శివశక్తి ఫౌండేషన్ బల్లల వితరణ

వినుకొండ టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో రోగుల సౌకర్యం కోసం ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 10 బల్లలను వితరణగా అందజేసి, బుధవారం ఆసుపత్రిలో వాటిని ఏర్పాటు చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో పలువురు మృతిచెందడంతో సమాచారం తెలుసుకొని వైద్యశాలకు వచ్చిన బంధువులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ వైద్యశాల ఆవరణలో బల్లాలను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తెల్లవారకముందే సిబ్బంది వైద్యశాల ఆవరణలో బల్లలు ఏర్పాటు చేయడంపై రోగులు, రోగి బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్



ప్రభుత్వ వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ అంకినీడుప్రసాద్

నరసరావుపేట లీగల్, మే 14 (ఆంధ్రజ్యోతి), హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారికి త్వరలో క్యాన్సర్ వ్యాధికి సంబంధించి స్క్రీనింగ్ టెస్ట్ చేయనున్నట్లు ఏపీ శాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.అంకినీడు ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ నాకో ఆదేశానుసారం నరసరావుపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ కుమార్, సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ జై కృష్ణ, డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ దయానిధి, డాక్టర్ మంత్రునాయక్, డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.



ఉరితాళ్లతో నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

ఉరి తాళ్లతో పారిశుధ్య కార్మికుల నిరసన

నరరావుపేట టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): మెడ కు ఉరితాడు వేసుకొని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు వినూత్నంగా నిరసన తెలియజేశారు. బుధవారం నరసరావుపేట పురపాలక సంఘం కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె 56వ రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్‌చేసి, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి ఏమాత్రం ఫలితం దక్కలేదన్నారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కారించాలని డిమాండ్ చేశారు.

క్రీడాకారులకు శివశక్తి ఫౌండేషన్ దుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులతో క్రీడాకారులు, టీడీపీ నాయకులు

వినుకొండ టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రక్రీడాశాఖ (శాప్) ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు స్థానిక విద్యావికాస్ పాఠశాలలో జరిగే కబడ్డీ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి కబడ్డీ క్రీడాకారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోచ్ కె.శ్రీహరి క్రీడాకారులకు సూచించారు. కబడ్డీ క్యాంప్ నిర్వహించేందుకు సహకరించిన విద్యావికాస్ పాఠశాల యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా 13రోజుల పాటు నిర్వహిస్తున్న క్యాంప్‌లోని క్రీడాకారులకు శివశక్తి ఫౌండేషన్ ద్వారా దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ గంగినేని రాఘవ, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఆయుబ్‌ఖాన్, ఈశ్వరు టీడీపీ నాయకులు గన్నవనేని ఆకోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు ఘనంగా మహానాడు

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రస్థానంలో కనీవినీ ఎరుగని రీతిలో ఈసారి మహానాడు ఉండబోతుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. కీలకమైన సమయంలో అనేక సవాళ్లను ఎదుర్కొని అధికారంలోకి వచ్చిన సందర్భానికి గుర్తుగా కడప వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహానాడు పార్టీ అధినాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఎన్‌టీఆర్ భవన్‌లో మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో నిర్వహించి మంత్రులు, నేతల సమావేశంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడపలో మహానాడు నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించినట్లు ఆయన తెలిపారు.

పండగలా కూటమి ప్రభుత్వ వార్షికోత్సవం: జీవీ

రాష్ట్రవ్యాప్తంగా పండగ వాతావరణంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిన సందర్భం నిర్వహించనున్నట్లు చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ప్రతి నెలా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ఏడాది మొత్తానికి సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయాలన్న సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం విప్లవాత్మకమైనదన్నారు. జూన్ 12కే తల్లికి వందనం అమలుతో లక్షలమంది పేద విద్యార్థులకు మేలు జరగనుండటం ఎంతో సంతృప్తిని ఇస్తోందన్నారు. అన్నదాత సుఖీభవకు కూడా అదేరోజు నుంచి శ్రీకారం చుట్టనున్నామని, ఇప్పటికే అందుకు కావాల్సిన నిధులు కూడా కేటాయింపులు చేయటం హామీల అమలులో ఎన్డీయే ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. ఇదే సమయంలో ప్రతి నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో జూన్ 16, 17, 18 తేదీల్లో తలపెట్టిన తిరంగా యాత్రలు, సభలు ప్రజల్లో దేశభక్తిని, సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందిస్తాయని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు వెల్లడించారు.

బాలుడి కడుపులో నుంచి రూపాయి నాణం వెలికితీత

చిలకలూరిపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జానకీ నర్సింగ్ హోమ్‌లోని డాక్టర్ బలరామ కృష్ణ లివర్ అండ్ గ్యాస్ట్రో సెంటర్లో బుధవారం అరుదైన వైద్య చికిత్స జరిగింది. రూపాయి నాణెం మింగి బాధపడుతున్న రెండున్నరేళ్ల బాలుడిని అతడి తల్లిదండ్రులు చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువచ్చారు. కడుపులో రూపాయి నాణం ఇరుక్కుపోయినట్టు వైద్యులు గుర్తించారు. లివర్ అండ్ గ్యాస్ట్రో వైద్య నిపుణులు డాక్టర్ బలరామ కృష్ణ తేజస్వి ఎండోస్కోపి విధానంతో నాణాన్ని బయటకు తీశారు. సకాలంలో వస్తే ఇలాంటి కేసులలో శస్త్రచికిత్స అవసరం లేకుండా ఎండోస్కోపీ విధానంలో చికిత్స చేయటానికి వీలవుతుందని చెప్పారు. డాక్టర్ బలరామ కృష్ణ తేజస్విని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు అభినందించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో నైస్ పాఠశాలలో నూరు శాతం ఉత్తీర్ణత

నాదెండ్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్రు గ్రామ సమీపంలోని మైనంపాడులోని నైస్ పాఠశాల విద్యార్థులు 10వ తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో నూటికి నూరుశాతం ఫలితాలు సాధించారు. మొత్తం 18మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. పాఠశాలకు చెందిన బీఎస్‌పీ మణింత 461మార్కులు సాధించి ప్రథమ స్థానాన్ని, కేవీవీ కృష్ణ 426 మార్కులు సాధించి ద్వితీయ స్థానాన్ని కే సంతోష్‌నాయక్ 412 మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పీ సీతారామయ్య, తహసీల్దార్ ఏ సుధాకర్

ముంపు సర్వేపై రెవెన్యూ సచివాలయాల సిబ్బందికి అవగాహన

బొల్లాపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టులో భాగంగా బొల్లాపల్లి రిజర్వాయర్ ఏర్పాటులో ముంపునకు గురయ్యే ఐదు రెవెన్యూ గ్రామాలైన రేమిడిచర్ల, గుమ్మనంపాడు, అయ్యన్నపాడు, గరికపాడు, సచివాలయ సిబ్బందితో సామాజిక, ఆర్థిక విషయాల్లో సర్వే చేయటం గురించి బుధవారం మండల పరిషత్ ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామకోటయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట వద్ద కాలువపై బ్రిడ్జి పనులు ప్రారంభం



శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిని తొలగిస్తున్న ఎక్సలేటర్

వినుకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట కాలువ కట్టపై మున్సిపల్ అధికారులు బుధవారం పనులు ప్రారంభించారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు ఇటీవల శంకుస్థాపన చేశారు. కొత్తపేట నుంచి సిద్ధార్థనగర్ వాసులకు ఈ బ్రిడ్జి అవసరాన్ని గుర్తించి సుమారు రూ.15లక్షలతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. సుమారు మూడు నెలల వ్యవధిలో బ్రిడ్జి పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వారు తెలిపారు.



మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బారావు భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు, అంతిమ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ, కొమ్మాలపాటి

మాజీ ఎంపీపీ కోటిసుబ్బారావుకు ఘన నివాళి

● అంతిమయాత్రలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం మాజీ ఎంపీపీ, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కడియం కోటి సుబ్బారావు మంగళవారం తిరుపతిలో గుండెపోటుతో మృతిచెందారు. కడియం కోటి సుబ్బారావు భౌతిక కాయాన్ని స్వగ్రామం నరసరావుపేట మండలం చింతలపాలెం తరలించారు. చింతలపాలెంలో బుధవారం అత్యక్రియలు నిర్వహించారు. ముందుగా కడియం కోటి సుబ్బారావు భౌతిక కాయాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సందర్శించి నివాళి అర్పించారు. కడియం కోటి సుబ్బారావు లేనిలోటు పూడ్చలేనిదన్నారు. సీనియర్ నాయకుడైన కడియం కోటి సుబ్బారావుకు తమతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పులిమి వెంకట రామిరెడ్డి, వేల్పుల సింహాద్రి యాదవ్, కొల్లి బ్రహ్మయ్య, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, వాసిరెడ్డి రవి, రాపర్ల జగ్గారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రమేష్‌బాబు, హరికృష్ణ, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



మృతుడు అనంత రాములు

బొల్లాపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు కురవ సమీపంలో ప్రకాశం జిల్లా ముటుకూరు నుంచి ఇటుకల లోడుతో వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం తెల్లగట్లకు చెందిన మూరబోయిన అనంత రాములు(23) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఏ బాలకృష్ణ తెలిపారు.





విద్యుత్ సమస్యను వివరిస్తున్న సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి

● సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము

వినుకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్‌నగర్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లోని ప్రజలు లో ఓల్టేజీ సమస్యతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము అన్నారు. హనుమాన్‌నగర్‌లో 1 నుంచి 4 లైన్లకు సంబంధించిన ప్రజలు కరెంటు సప్లయ్ చాలా తక్కువగా వస్తున్న కారణంగా టీవీలు, ఏసీలు, ఫ్రిజ్‌లు ఒక్కసారిగా షార్టేజీలకు గురై పాడైపోతున్నాయన్నారు. పగలు ఇళ్లల్లో ఊపిరాడక పసిపిల్లలు, వృద్ధులు నిత్యం అల్లాడుతున్నారని, లో ఓల్టేజీ పుణ్యమా అని ఏసీలు కూడా పనిచేయడం లేదని, దోమలు కుట్టి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ఈ నేపథ్యంలో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మారుతివరప్రసాద్, పవన్‌కుమార్, బూదాల నాగయ్య, షేక్ మస్తాన్‌వలి, షేక్ నాగూర్, సుబ్బారావు, బ్రహ్మం, హనుమాన్ నగర్ ప్రజలు పాల్గొన్నారు.





అంత్యక్రియలలో పాల్గొన్న గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, సుబ్బరాయగుప్తా, విజయకుమార్ తదితరులు, వెంకటేశ్వరరావు (ఫైల్ ఫొటో)

పెనుగొండకు ఘన నివాళి

నరసరావుపేట టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, ఎస్ఎస్ఎన్ కళాశాల ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు (87) మంగళవారం మృతిచెందారు. పట్టణంలో బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. పెనుగొండ వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని మాజీ గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్, ఎస్ఎస్ఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బారాయగుప్తా, అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కపలవాయి రాజేంద్రప్రసాదు, ఆంజనేయులు, పలువురు పట్టణ ప్రముఖులు సందర్శించి ఘనంగా నివాళి అర్పించారు. అంత్యక్రియల్లో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీహెచ్‌వోల వినూత్న నిరసన

నరసరావుపేట టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట గాంధీ పార్కు వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఒంటి కాలిపై నిలబడి మంగళవారం తమ వినూత్న నిరసన తెలియజేశారు. వైద్యఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద సీహెచ్‌వోలుగా గత రెండు సంవత్సరాలుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 17 రోజులుగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆరు సంవత్సారాలు సర్వీసు ఉన్న సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని, ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. ప్రతినెల జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ప్రతి సంవత్సరం ఐదు శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను తీర్చేవిధంగా హామీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అసోసియేషన్ నాయకులు ఎం.అనుపమ్మ, సాగర్, మస్తాన్, వినోద్, ఏఐటీయూసీ నాయకులు రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



వినూత్న నిరసన తెలియజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు